RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 71 | మార్చి 31 సోమవారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 71 | March 31 Tuesday 2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


‘గిగ్ వర్కర్ల బిల్లు’కు రాష్ట్ర అసెంబ్లీ ఆమోదం 2

## ఆహార కల్తీని అరికట్టేందుకు

# కొత్త వ్యవస్థ

### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన



హైదరాబాద్ జనసంఘర్షణ

ఆహార కల్తీని అరికట్టేందుకు ‘ఈగల్’, ‘హైడ్రా’ తరహాలో ఒక శక్తివంతమైన ప్రత్యేక వ్యవస్థను తీసుకురానున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. సోమవారం మీడియాతో జరిగిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ, నిత్యావసర వస్తువుల అక్రమ నిల్వను హత్యానేరం కంటే తీవ్రమైనదిగా పరిగణిస్తామని హెచ్చరించారు. సన్నబియ్యం పంపిణీ ద్వారా బ్లాక్ మార్కెట్ మాఫియాకు అడ్డుకట్ట పడిందని, రాష్ట్రంలోని 86 శాతం మంది ప్రజలకు నాణ్యమైన బియ్యం అందుతున్నాయని పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో మార్పులు తెస్తూ, రైతులను లాభసాటి వాణిజ్య పంటల వైపు ప్రోత్సహిస్తున్నామని, పంట మార్పిడిపై ఒత్తిడి చేయకుండా అవగాహన కల్పిస్తామని తెలిపారు. వరి సాగుకు బోనస్ ఇస్తున్నామని, నిరుపేదలకు రూ. 500లకే గ్యాస్ సిలిండర్ పథకం నిరంతరాయంగా కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. దేశంలో నియోజకవర్గాల పునర్విభజన అంశంపై సీఎం తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. జనాభా ప్రాతిపదికన 50 శాతం సీట్లు పెంచితే అది దక్షిణ భారతదేశానికి, ముఖ్యంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం చేస్తుందని విమర్శించారు. ఇది కేవలం రాజకీయ

➢ మిగతా 2వ పేజీలో..

## గడ్డిమందును

# నిషేధించాలి

### అసెంబ్లీలో తీర్మానం



హైదరాబాద్ జనసంఘర్షణ

తెలంగాణ రాష్ట్రంలో ప్రాణాంతకమైన ‘పారాక్వాట్ డైక్లోరైడ్’ గడ్డి మందును పూర్తిగా నిషేధించాలని కోరుతూ రాష్ట్ర అసెంబ్లీ ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించింది. ఈ తీర్మానాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సభలో ప్రవేశపెట్టారు. వ్యవసాయ రంగంలో కలుపు నివారణకు వాడుతున్న ఈ రసాయనం అత్యంత ప్రమాదకరంగా మారిందని, ఇప్పటికే అనేక దేశాల్లో దీనిపై నిషేధం ఉందని ఆయన సభ్యులకు వివరించారు. ఈ విషపూరిత రసాయనం

➢ మిగతా 2వ పేజీలో..

## దిగివస్తున్న బంగారం ధరలు



బొంబాయి జనసంఘర్షణ

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు మరియు అంతర్జాతీయ మార్కెట్‌లో డాలర్ విలువ పెరగడం బంగారం ధరలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి.

➢ మిగతా 2వ పేజీలో..

# చర్చల ద్వారానే పరిష్కారం

### కేంద్ర హోం మంత్రి అమిత్ షా



న్యూఢిల్లీ జనసంఘర్షణ

తుపాకులు పట్టి ప్రజల ప్రాణాలు తీసేవారు దేశభక్తులు ఎలా అవుతారని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రశ్నించారు. మావోయిస్టుల హింసాత్మక ధోరణిపై పార్లమెంట్‌లో ఘాటుగా స్పందించిన ఆయన, చర్చల ద్వారానే ఏ సమస్యకైనా పరిష్కారం సాధ్యమని స్పష్టం చేశారు. నక్సలైట్లు తమ సిద్ధాంతాలను విదేశాల నుండి దిగుమతి చేసుకున్నారని, వారి ఆదర్శం భారతీయులు కాదని, మావో అని ఆయన విమర్శించారు. దశాబ్దాల కాలంగా బస్తర్ వంటి ప్రాంతాల్లో సమాంతర ప్రభుత్వాలు నడుపుతూ అభివృద్ధిని అడ్డుకున్నారని, అటువంటి రక్తపాత సిద్ధాంతాలను ప్రజలంతా వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. నక్సలిజం వల్ల గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం మరియు

➢ మిగతా 2వ పేజీలో..

## లాకర్లలోని వస్తుకు బీమా కవరేజీ సాధ్యం కాదు

న్యూఢిల్లీ జనసంఘర్షణ

బ్యాంకు లాకర్లలో భద్రపరిచే విలువైన వస్తువులకు బీమా కవరేజీ కల్పించడం సాధ్యం కాదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో స్పష్టం చేశారు. లాకర్లలో కస్టమర్లు ఏమి దాచుకున్నారో చూసే అధికారం బ్యాంకు అధికారులకు ఉండదని, ఆ వస్తువుల వివరాలు ఎక్కడా రికార్డు కావు కాబట్టి వాటి విలువ ఆధారంగా

➢ మిగతా 2వ పేజీలో..

## ‘హేట్ స్పీచ్ అండ్ హేట్ క్రైమ్స్ (ప్రివెన్షన్) బిల్లుపై కేటీఆర్ అభ్యంతరం



హైదరాబాద్ జనసంఘర్షణ

తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన ‘హేట్ స్పీచ్ అండ్ హేట్ క్రైమ్స్ (ప్రివెన్షన్) బిల్లు’పై భారత్ రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ బిల్లును పౌర స్వేచ్ఛను కాలరాసే ఒక “క్రూరమైన ఆయుధం”గా అభివర్ణించిన ఆయన, ఇది ప్రజాస్వామ్య మూలాలకే ముప్పుగా మారుతుందని హెచ్చరించారు. సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో, ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే విమర్శకుల గొంతు నొక్కడమే లక్ష్యంగా ఈ నిరంకుశ చట్టాన్ని తీసుకువస్తున్నారని ఆయన మండిపడ్డారు. సామాజిక సామరస్యం పేరిట తెస్తున్న ఈ బిల్లులోని నిబంధనలు అత్యంత అస్పష్టంగా ఉన్నాయని, ఇవి అధికారుల

➢ మిగతా 2వ పేజీలో..

## కుప్పకూలుతున్న స్టాక్ మార్కెట్లు




న్యూఢిల్లీ జనసంఘర్షణ

పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతల ప్రభావం దేశీయ స్టాక్ మార్కెట్లపై తీవ్రంగా పడింది. యుద్ధ భయాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు అమ్మకాలకు మొగ్గు చూపడంతో సోమవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్, నిఫ్టీలు భారీ

➢ మిగతా 2వ పేజీలో..

# ఇరాన్ మెడలు వంచి ఒప్పిస్తాం

### అమెరికా అధ్యక్షుడు ట్రంప్



వాషింగ్టన్ డీసీ జనసంఘర్షణ

ఇరాన్ ప్రభుత్వం తక్షణమే మెడలు వంచి ఒప్పందానికి రాకపోతే ఆ దేశాన్ని సర్వనాశనం చేస్తామని అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తీవ్రస్థాయిలో హెచ్చరించారు. ఇరాన్ వీలైనంత త్వరగా చర్చల ద్వారా ఏకాభిప్రాయానికి రావాలని, ముఖ్యంగా అంతర్జాతీయ వాణిజ్యానికి కీలకమైన హర్మూజ్ జలసంధిని

➢ మిగతా 2వ పేజీలో..

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
31 మంగళవారం, మార్చి 2026

## ఆహార కల్తీని అరికట్టేందుకు కొత్త వ్యవస్థ

**మొదటిపేజీ తరువాయి..** అంశం కాదని, దక్షిణాదిపై ఉత్తరాది ఆధిపత్యం చెలాయించే కుట్రని ఆయన అభివర్ణించారు. ఈ విషయంలో బీజేపీ ఎంపీ లక్ష్మణ్ తన పదవికి రాజీనామా చేసి దక్షిణాది ప్రయోజనాల కోసం పోరాడాలని డిమాండ్ చేశారు. ఇదే సమయంలో మాజీ సీఎం కేసీఆర్‌పై విమర్శలు గుప్పిస్తూ, కేసీఆర్ చేసిన తప్పుల వల్లే తన పాలనలోని మంచి పనులు ప్రజలకు స్పష్టంగా తెలుస్తున్నాయని, రావణుడి చెడు వల్లే రాముడి గొప్పతనం తెలిసినట్లుగా తనకూ మంచి పేరు వస్తోందని ఎద్దేవా చేశారు. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని రేవంత్ రెడ్డి వెల్లడించారు.

## గడ్డిమందును నిషేధించాలి

**మొదటిపేజీ తరువాయి..** వల్ల రైతులు, కూలీలు తీవ్రమైన ఆరోగ్య సమస్యల బారిన పడటమే కాకుండా, అనేక మంది ప్రాణాలు కోల్పోవడం పట్ల మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. సుస్థిర మరియు సేంద్రీయ వ్యవసాయ లక్ష్యాలకు ఈ గడ్డి మందు పెను సవాలుగా మారిందని, అందుకే దీని తయారీ, రవాణా, దిగుమతి మరియు వాడకాన్ని అన్ని రూపాల్లోనూ నిషేధించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని కేంద్రానికి నివేదిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేశారు. ఇటీవల జరిగిన కొన్ని విషాద సంఘటనలు కూడా ఈ నిర్ణయం తీసుకోవడంలో కీలక భూమిక పోషించాయి. పర్యావరణాన్ని, రైతుల ప్రాణాలను కాపాడటమే ధ్యేయంగా ప్రభుత్వం ఈ అడుగు వేసింది.

## చర్చల ద్వారానే పరిష్కారం

**మొదటిపేజీ తరువాయి..** మౌలిక వసతులు ధ్వంసమయ్యాయని, చిన్న పిల్లల చేతికి ఆయుధాలు ఇచ్చి వారి జీవితాలను నాశనం చేశారని అమిత్ షా మండిపడ్డారు. భగత్ సింగ్, బిర్సా ముండా వంటి మహనీయులతో నక్సలైట్లను పోల్చడం తగదని హితవు పలికారు. గతంలో కాంగ్రెస్ హయాంలోనే నక్సలిజం వేగంగా విస్తరించిందని ఆరోపిస్తూ, ప్రస్తుతం ఎన్డీయే ప్రభుత్వ పాలనలో మారుమూల ప్రాంతాల్లో సైతం అభివృద్ధి పరుగులు తీస్తోందని పేర్కొన్నారు. ఆయుధాలు వీడి చర్చలకు రావాలని అనేకసార్లు కోరామని, ప్రజాస్వామ్య దేశంలో హింసకు తావు లేదని ఆయన స్పష్టం చేశారు.

## ‘హేట్ స్పీచ్ అండ్ హేట్ క్రైమ్స్ (ప్రివెన్షన్) బిల్లుపై కేటీఆర్ అభ్యంతరం

**మొదటిపేజీ తరువాయి..** విచక్షణకు అపరిమిత అధికారాలను కట్టబెట్టడం ద్వారా దుర్వినియోగమయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా బిల్లులో వాడిన ‘వ్యతిరేక భావాల ప్రేరేపణ’, ‘సామాజిక సమగ్రత దెబ్బతీయడం’ వంటి పదాలకు సరైన న్యాయపరమైన నిర్వచనాలు లేవని, వీటిని సాకుగా చూపి జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలు మరియు ప్రతిపక్ష నేతలను ఇబ్బందులకు గురిచేసే ప్రమాదం ఉందని కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వ నిర్ణయాలను తప్పుపడితే వాటిని ‘ఫేక్ న్యూస్’గా ముద్రవేసి శిక్షించే అవకాశం ఉందన్న ఆయన, ఇది రాజ్యాంగం కల్పించిన భావప్రకటన స్వేచ్ఛకు విరుద్ధమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ‘శ్రేయా సింఘల్’ తీర్పును గుర్తుచేస్తూ, కేవలం ప్రత్యక్ష హింసకు దారితీసే వ్యాఖ్యలనే నియంత్రించాలని, విమర్శలను లేదా వ్యంగ్యాన్ని శిక్షార్హమైన నేరాలుగా పరిగణించడం రాజ్యాంగ ఉల్లంఘనే అవుతుందని స్పష్టం చేశారు. ఏడు నుండి పది ఏళ్ల జైలు శిక్షలను ప్రతిపాదించడం ద్వారా సామాన్య ప్రజలను, విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేయడమే ప్రభుత్వ ఆంతర్యమని విమర్శిస్తూ, తక్షణమే ఈ బిల్లును ఉపసంహరించుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## దిగివస్తున్న బంగారం ధరలు

**మొదటిపేజీ తరువాయి..** గత ఏడాది ఇన్వెస్టర్లకు భారీ లాభాలను తెచ్చిపెట్టిన పసిడి, ప్రస్తుతం ధరల పతనంతో ఆందోళన కలిగిస్తోంది. యుద్ధ మేఘాలు కమ్ముకోకముందు 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర సుమారు 1.90 లక్షల రూపాయల వరకు పలికినప్పటికీ, తాజా పరిణామాల నేపథ్యంలో ధరలు భారీగా దిగివచ్చాయి. సోమవారం హైదరాబాద్ మార్కెట్‌లో బంగారం ధరలు స్వల్పంగా క్షీణించి ఒడిదుడుకులకు లోనయ్యాయి. తాజా ట్రేడింగ్ వివరాల ప్రకారం, హైదరాబాద్‌లో 10 గ్రాముల స్వచ్ఛమైన 24 క్యారెట్ల బంగారం ధర 1,47,280 రూపాయల వద్ద కొనసాగుతోంది. అలాగే 22 క్యారెట్ల బంగారం ధర 1,35,000 రూపాయలకు, 18 క్యారెట్ల బంగారం ధర 1,10,460 రూపాయలకు చేరుకుంది. ఒకే రోజులో 24 క్యారెట్లపై 810 రూపాయలు, 22 క్యారెట్లపై 750 రూపాయలు మేర ధర తగ్గడం గమనార్హం. మార్కెట్ నిపుణుల విశ్లేషణ ప్రకారం, భౌగోళిక రాజకీయ పరిస్థితులు చక్కబడే వరకు పసిడి ధరల్లో ఇటువంటి అస్థిరత కొనసాగే అవకాశం ఉంది.

## లాకర్లలోని వస్తుకు బీమా కవరేజీ సాధ్యం కాదు

**మొదటిపేజీ తరువాయి..** బీమా అందించడం కుదరదని ఆమె వివరించారు. ఈ మేరకు సోమవారం ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆమె సమాధానమిస్తూ, లాకర్లలోని వస్తువులను తనిఖీ చేయడం బ్యాంకు నిబంధనలకు విరుద్ధమని గుర్తుచేశారు. అయితే, ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం దొంగతనాలు, అగ్నిప్రమాదాలు లేదా బ్యాంకు మోసాల వంటి సంఘటనలు జరిగినప్పుడు మాత్రం బ్యాంకులు పరిహారం చెల్లిస్తాయని మంత్రి పేర్కొన్నారు. ఈ పరిహారం అనేది సదరు లాకర్ వార్షిక అద్దెకు 100 రెట్లుగా ఉంటుందని ఆమె వెల్లడించారు. లాకర్లలో ఉన్న వస్తువుల విలువ బ్యాంకులకు తెలిసే అవకాశం లేదు కాబట్టి, ప్రస్తుతానికి బీమా కవరేజీకి సంబంధించి ఎటువంటి కొత్త ప్రతిపాదనలు ప్రభుత్వం వద్ద లేవని నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు.

## ఇరాన్ మెడలు వంచి ఒప్పిస్తాం

**మొదటిపేజీ తరువాయి..** వెంటనే తెరవాలని ఆయన డిమాండ్ చేశారు. ఒకవేళ ఇరాన్ మొండిగా వ్యవహరిస్తే, ఆ దేశంలోని విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, చమురు క్షేత్రాలు, ఖర్గ్ ద్వీపం వంటి వ్యూహాత్మక ప్రాంతాలతో పాటు డీశాలినేషన్ ప్లాంట్లను పూర్తిగా పేల్చివేస్తామని హెచ్చరించారు. ఈ మేరకు తన ‘ట్రూత్ సోషల్’ వేదికగా పోస్ట్ చేసిన ట్రంప్, ఇరాన్‌లో సాగుతున్న అమెరికా సైనిక కార్యకలాపాలను ముగించేందుకు తీవ్రమైన చర్చలు జరుగుతున్నాయని, ప్రస్తుతం మంచి పురోగతి కనిపిస్తోందని పేర్కొన్నారు. అయితే, ఒప్పందం కుదరడంలో జాప్యం జరిగితే మాత్రం భయంకరమైన పరిణామాలు ఉంటాయని స్పష్టం చేశారు. గత 47 ఏళ్లలో ఇరాన్ కారణంగా ప్రాణాలు కోల్పోయిన అమెరికన్ సైనికులు మరియు ఇతరుల మరణాలకు ప్రతీకారంగా ఈ దాడులు ఉంటాయని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు గరిష్ట స్థాయికి చేరిన తరుణంలో ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రపంచవ్యాప్తంగా కలకలం రేపుతున్నాయి.

## కుప్పకూలుతున్న స్టాక్ మార్కెట్లు

**మొదటిపేజీ తరువాయి..** పతనాన్ని మూటగట్టుకున్నాయి. సెన్సెక్స్ ఏకంగా 1635.67 పాయింట్లు నష్టపోయి 71,947.55 వద్ద ముగియగా, నిఫ్టీ 488.20 పాయింట్లు కోల్పోయి 22,331.40 వద్ద స్థిరపడింది. కేవలం ప్రధాన సూచీలే కాకుండా మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ రంగాలు కూడా సుమారు 2.6 శాతం మేర క్షీణించాయి. ముఖ్యంగా ఆటోమొబైల్, బ్యాంకింగ్, రియల్టీ, టెలికాం వంటి కీలక రంగాలు 2 నుండి 4 శాతం మేర నష్టాలను చవిచూశాయి. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు మళ్లీ ఆకాశాన్ని తాకుతుండటం ఆందోళన కలిగిస్తోంది. బ్యారెల్ క్రూడ్ ఆయిల్ ధర 115 డాలర్లకు చేరుకోగా, ఇది త్వరలోనే 120 డాలర్లకు చేరవచ్చనే అంచనాలు మార్కెట్ వర్గాలను కలవరపెడుతున్నాయి. చమురు ధరల పెరుగుదల ప్రభావంతో భారత రూపాయి విలువ కూడా భారీగా క్షీణించింది. ఒక దశలో డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 95.12 వద్ద ఆల్‌టైమ్ కనిష్ఠ స్థాయిని తాకడం గమనార్హం. చివరకు స్వల్పంగా కోలుకుని 94.83 వద్ద ముగిసింది. భౌగోళిక రాజకీయ అనిశ్చితి కొనసాగితే మార్కెట్లు మరిన్ని ఒడిదుడుకులకు లోనయ్యే అవకాశం ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## కేరళలో ఎల్‌డిఎఫ్‌లో బిజెపి కుమ్మక్కు

**ఎన్నికల ప్రచారంలో రాహుల్ ఆరోపణలు**

**తిరువనంతపురం, మార్చి30 :** కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ కు బీజేపీ పరోక్షంగా మద్దతిస్తోందని కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ ఎన్నికల్లో పోటీ యూడీఎఫ్‌కు, సీపీఎం–బీజేపీ కంబైన్‌కు మధ్యే జరగనుందని అన్నారు. పట్టంనాంతిట్ట జిల్లాలోని అదూర్‌లో సోమవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచారసభలో రాహుల్ మాట్లాడుతూ, కేరళలో యూడీఎఫ్ ఉండకూడదని బీజేపీ కోరుకుంటోందని, ఎందుకంటే కాంగ్రెస్‌కు మాత్రమే జాతీయ స్థాయిలో బీజేపీని సవాలు చేయగలిగే శక్తి ఉందనే విషయం వాళ్లకు బాగా తెలుసునని అన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌తో తాము సైద్ధాంతిక పోరాటం చేస్తున్నామని తెలిపారు. విపక్ష నేతలను సెంట్రల్ ఏజెన్సీలు టా÷–గ్గ÷ట్ చేస్తున్నాయని, కానీ ఎల్డీఎఫ్‌పై మాత్రం ఎలాంటి దర్యాప్తులు ఉండవని రాహుల్ విమర్శించారు. తనపై 36 కేసులు పెట్టారని, 55 గంటల సేపు నిర్విరామంగా ప్రశ్నించారని అన్నారు. కేరళ సీఎం పినరయి విజయన్‌పై మాత్రం ఎలాంటి చర్యలు లేవన్నారు. ప్రధాని మోదీ ఎక్కడికి వెళ్లినా ఆలయాలు, మతం గురించి మాట్లాడతారని, కానీ ఇటీవల పాలక్కాడ్ పర్యటనలో శబరిమల అంశాన్ని లేవనెత్తడం మరిచిపోయారని రాహుల్ విమర్శించారు. శబరిమలలోని అయ్యప్ప ఆలయంతో ముడిపడి ఉన్న అంశంపై మాట్లాడకపోవడం ద్వారా బీజేపీ, ఎల్డీఎఫ్ కలిసి పనిచేస్తున్నట్టు స్పష్టమవుతోందన్నారు. యూడీఎఫ్ అధికారంలోకి వస్తే ఆలయంలో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ‘గిగ్ వర్కర్ల బిల్లు’కు రాష్ట్ర అసెంబ్లీ ఆమోదం

**హైదరాబాద్**

తెలంగాణలో లక్షలాది మంది గిగ్ వర్కర్ల (డెలివరీ బాయ్స్, క్యాబ్ డ్రైవర్లు మొదలైన వారు) ప్రయోజనాలను కాపాడేందుకు ఉద్దేశించిన చారిత్రాత్మక ‘గిగ్ వర్కర్ల బిల్లు’కు రాష్ట్ర అసెంబ్లీ ఆమోదం తెలిపింది. సోమవారం శాసనసభలో కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి ఈ బిల్లును ప్రవేశపెట్టగా, సభ దీనిని ఆమోదించింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గిగ్ వర్కర్ల సాధకబాధకాలను స్వయంగా అడిగి తెలుసుకున్న తర్వాతే ఈ ముసాయిదాను సిద్ధం చేశామని, కంపెనీల ప్రతినిధులతో ఐదు విడతలుగా చర్చలు జరిపినట్లు వెల్లడించారు. ఈ చట్టం వల్ల కంపెనీలకు ఎలాంటి నష్టం ఉండదని, కేవలం కార్మికుల హక్కుల రక్షణే ధ్యేయమని ఆయన స్పష్టం చేశారు.

ఈ బిల్లులోని ప్రధానాంశాల ప్రకారం, గిగ్ కార్మికుల పర్యవేక్షణ మరియు రిజిస్ట్రేషన్ కోసం ఒక ‘సామాజిక భద్రత మరియు సంక్షేమ బోర్డు’ను ఏర్పాటు చేస్తారు. ఇందులో మహిళలు, దివ్యాంగులకు కూడా ప్రాతినిధ్యం ఉంటుంది. ప్లాట్‌ఫాం ఆధారిత కార్మికులందరికీ ఒక ప్రత్యేక గుర్తింపు సంఖ్య కటాయిస్తారు, దీని ద్వారా ప్రభుత్వ పథకాలు నేరుగా వారికి అందుతాయి. అగ్రిగేటర్లు (సంస్థలు) జరిపే లావాదేవీల నుంచి 1 నుంచి 2 శాతం నిధులను సేకరించి, వాటిని కార్మికుల బీమా, పెన్షన్ మరియు ప్రసూతి ప్రయోజనాల కోసం కేటాయించిన ప్రత్యేక సంక్షేమ నిధికి జమ చేస్తారు.

నిబంధనలు ఉల్లంఘించే కంపెనీలపై కఠిన చర్యలు ఉంటాయని మంత్రి హెచ్చరించారు. గిగ్ వర్కర్లను ఇబ్బంది పెడితే అగ్రిగేటర్లకు భారీగా పెనాల్టీలు విధిస్తారు. మొదటిసారి తప్పు చేస్తే రూ. 50 వేలు, రెండోసారి రూ. లక్ష, మూడోసారి రూ. 1.50 లక్షల వరకు జరిమానా ఉంటుంది. పేమెంట్ల లెక్కింపులో పారదర్శకత ఉండాలని, యాప్ కంపెనీలు ఇష్టానుసారంగా రేట్లు తగ్గించడం కుదరదని బిల్లు స్పష్టం చేస్తోంది. కార్మికులను పనిలో నుంచి తొలగించినా లేదా పేమెంట్లు ఆపేసినా తక్షణమే ఫిర్యాదు చేసేందుకు జిల్లా స్థాయి అధికారులతో కూడిన ‘గ్రీవెన్స్ సెల్’ మరియు కమిటీలు అందుబాటులో ఉంటాయని మంత్రి వివరించారు.

## సైబర్ నేరగాడి ట్రాప్‌లో 6లక్షలు పోగొట్టుకున్న న్యాయమూర్తి

**పోలీసులు రంగంలోకి దిగడంతో మోసగాడి అరెస్ట్**

**ముంబై, మార్చి30 :** ఒక హైకోర్టు న్యాయమూర్తి, సైబర్ నేరగాడి ట్రాప్‌లో పడ్డారు. ఆ జడ్జికి ఒక లింక్ పంపిన అతడు రూ.6 లక్షల మేర ఆయనను మోసగించాడు. న్యాయమూర్తి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. చివరకు నిందితుడ్ని గుర్తించి అరెస్ట్ చేశారు. ముంబైలో ఈ సంఘటన జరిగింది. ఫిబ్రవరి 28న బాంబే హైకోర్టు న్యాయమూర్తి తన క్రెడిట్ కార్డ్ పాయింట్లను రీడీమ్ చేసుకు నేందుకు ప్రయత్నించారు. ఆ బ్యాంకు కస్టమర్ కేర్ నంబర్‌ను సంప్రదించడానికి ప్రయత్నించగా బిజీ వల్ల లైన్ కలవలేదు. ఆ న్యాయమూర్తి బ్యాంక్ కస్టమర్ కేర్ నంబర్ కోసం ఇంటర్నెట్‌లో వెతికారు. ఒక నకిలీ నంబర్‌కు ఆయన కాల్ చేశారు. జడ్జితో మాట్లాడిన సైబర్ మోసగాడు కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్‌గా నమ్మించాడు. ఆయనకు ఒక లింక్‌ను పంపి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించాడు. మరోవైపు ఆ న్యాయమూర్తి తన ఐఫోన్‌లో ఆ యాప్ డౌన్‌లోడ్ చేసేందుకు ప్రయత్నించారు. సాధ్యం కాకపోవడంతో ఆండ్రాయిడ్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆ నకిలీ టెలీకాలర్ సూచించాడు. ఈ నేపథ్యంలో న్యాయమూర్తి తన సిమ్ కార్డును ఇంటి పనిమనిషి ఆండ్రాయిడ్ ఫోన్‌లో వేసి ఆ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఆ యాప్‌లో తన క్రెడిట్ కార్డు వివరాలను నమోదు చేసిన వెంటనే ఆయన ఖాతా నుంచి రూ. 6.02 లక్షలు విత్ డ్రా అయ్యాయి. కాగా, మోసపోయినట్లు గ్రహించిన ఆ బాంబే హైకోర్టు జడ్జి వెంటనే ముంబై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కఫ్ పరేడ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. జార్ఖండ్‌లోని జామ్తారాలో నివసించే 25 ఏళ్ల మజార్ ఆలం ఇస్రాయిల్ మియాన్‌ను నిందితుడిగా పోలీసులు గుర్తించారు. జార్ఖండ్‌లోని జామ్తారా సైబర్ సెల్, కర్మతాండ్ పోలీసుల సహాయంతో పది రోజుల్లోనే నిందితుడ్ని అరెస్ట్ చేశారు. 10 రాష్ట్రాల్లో జరిగిన 36 సైబర్ మోసాల కేసులతో నిందితుడికి సంబంధం ఉన్నట్లు దర్యాప్తులో తెలిసిందని పోలీస్ అధికారి తెలిపారు.

# వ్యవసాయనామ సంవత్సరం అని ప్రకటించి, బడ్జెట్‌లో కోతలా?

- బడ్జెట్‌ను సవరించాలి.
- తెలంగాణ రైతు సంఘం రౌండ్ టేబుల్ సమావేశంలో జూలకంటి రంగారెడ్డి, టి సాగర్, సారంపల్లి మల్లారెడ్డి

హైదరాబాద్ సిటిబ్యూరో /మార్చ్ 30( జనసంఘర్షణ )

వ్యవసాయనామ సంవత్సరం అని ముఖ్యమంత్రి ప్రకటించి బడ్జెట్‌లో మాత్రం కోత విధించడం అన్యాయమని, బడ్జెట్‌ను సవరించాలని తెలంగాణ రైతు సంఘం రౌండ్ టేబుల్ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్, సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి డిమాండ్ చేశారు. (మార్చి 30న) సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పి జంగారెడ్డి అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడుతూ...రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి రూ.23,179 కోట్లు కేటాయించినట్లు ఆర్థిక మంత్రి ప్రకటించారు. గత సంవత్సరం 24,439 కోట్లు కేటాయించగా ఈ సంవత్సరం 1250 కోట్లు తగ్గించారు. గవర్నర్ ప్రసంగంలో రాష్ట్ర ప్రభుత్వం "క్యూర్, ప్యూర్, రేర్" లక్ష్యాలుగా ప్రకటించి రేర్‌లో వ్యవసాయ రంగానికి బడ్జెట్ కేటాయింపుల ద్వారా వ్యవసాయోత్పత్తులు 236.87 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి జరిగినట్లు ప్రకటించారు. వ్యవసాయరంగం రాష్ట్ర బడ్జెట్‌లో రూ.1.11 లక్షల కోట్లు కాంట్రిబ్యూట్ చేస్తున్నట్లు చెప్పారు. రైతు భరోసా, యాంత్రీకరణ, పంటల బీమా, పంటల బోనస్ కు నిధులు పెంచినప్పటికీ మొత్తం బడ్జెట్లో వ్యవసాయ రంగానికి కేవలం 7.15% మాత్రమే కేటాయించారని అన్నారు. భూ భారతి అమల్లో రెవెన్యూ కోర్ట్‌ల పునరుద్ధరణ, 11 అంశాల పహాణి పత్రికలో వాస్తవ సాగుదార్లు (కౌలు దార్లు) పేరు నమోదు, పంటల బోనస్, మ్యానిఫెస్టోలో ప్రకటించిన పంటల కనీస మద్దతు ధరల నిర్ణయంకు సంబంధించిన బడ్జెట్ కేటాయింపులు లేవు. వ్యవసాయ ప్రణాళిక ద్వారా వ్యవసాయ ఉత్పత్తుల పెంపుదల వల్ల రాష్ట్ర అవసరాల మేరకు ఉత్పత్తి చేయడానికి తగిన ప్రణాళిక లేదు. హార్టికల్చర్ శాఖ 2 దశాబ్దాలుగా 12 లక్షల ఎకరాలు మాత్రమే సాగు చేస్తున్నారు. రాష్ట్రంలో 4లక్షల ఎకరాలకు తగ్గింది. వ్యవసాయ దిగుమతుల ద్వారా రైతులు నష్టపోతున్నారు. పత్తి, వరి పంటలను మాత్రమే మద్దతు ధరల ఆధారంగా సాగు చేస్తున్నారు. ఆ రైతులకు కూడా కనీస మద్దతు ధరలు అమలుకావడం లేదు. భూ భారతి అమలు చేయడం వల్ల కౌలు దార్లకు ఆర్థిక రక్షణ లేకపోవడంతో ఆత్మ హత్యలకు పాల్పడుతున్నారు. ఒక వైపున వ్యవసాయాభివృద్ధి అంటూ మరో వైపున యేటా 460 మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వ ప్రకటనలకు, లక్ష్యాలకు అనుగుణంగా బడ్జెట్ కేటాయింపులు లేకపోవడంతో వ్యవసాయ రంగంలో మాంద్యం పెరుగుతుంది. ప్రస్తుత బడ్జెట్‌లో వ్యవసాయరంగం కౌలు రైతులకు రైతు భరోసా, ప్రకృతి వైపరీత్యాల పరిహారం, మార్కెట్ జోక్యం పథకం కింద నిధుల కేటాయింపు లేదు. పాల ఉత్పత్తి దార్లకు లీటరుకు రూ.5 ప్రోత్సాహకం ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టో



ప్రకటించి బడ్జెట్ నిధులు కేటాయించలేదు. అందుకు అనుగుణంగా బడ్జెట్‌ను సవరించాలని, కనీసం బడ్జెట్‌లో 20శాతం నిధులు వ్యవసాయ రంగానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో అఖిలభారత రైతు కూలీ సంఘం జాతీయ కార్యదర్శి భాస్కర్, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్, గిరిజన సంఘము రాష్ట్ర కార్యదర్శి ఆర్ శ్రీ రామ్ నాయక్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బి ప్రసాద్, గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఉడుత రవీందర్, రైతు కూలీ సంఘం నాయకులు విజయ్ లు మాట్లాడుతూ... వ్యవసాయంగా బడ్జెట్ ను సవరించే వరకు రాష్ట్రవ్యాప్తంగా మార్చి 31 నుండి జరిగే ఆందోళనలో భాగస్వాములమవుతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి కట్టా నరసింహ్మ, రైతు సంఘం నాయకులు శివ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మీయుల సమక్షంలో అంజిబాబు జన్మదిన వేడుకలు

- శుభాకాంక్షలు తెలిపిన మిత్రులు.
- ఆచార్యులు, అధ్యాపకుల ఆశీస్సులు.

హైదరాబాద్ ప్రతినిధి అంజిబాబు, మార్చి 30 (జన సంఘర్షణ) :

సీనియర్ జర్నలిస్టు అంజిబాబు నాగుల జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు వర్సిటీలో జర్నలిజంలో ఉన్నత విద్య అభ్యసిస్తున్న ఆయనకు మిత్రులు శుభాకాంక్షలు తెలిపారు. పుట్టినరోజు సందర్భంగా మిత్రులు, ఆత్మీయులు అంజిబాబుతో కేకు కట్ చేయించి వేడుక జరిపారు. నిండునూరేళ్ళు ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలని కోరుకుంటూ అభినందించారు. అనంతరం వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు, జానపద విభాగం డీన్ విజయ్ పాల్, జర్నలిజం అధ్యాపకులు డా.షేక్ హసీనా, షేక్ షమీర్, గోపాల్ ఇతర పెద్దలను మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదాలు అందుకున్నారు.

**శుభాకాంక్షల వెల్లువ:**

అందరితోనూ ఆత్మీయంగా, కలివిడిగా ఉండే అంజిబాబుకు పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు వెల్లువలా వచ్చాయి. "స్నేహశీలి, అనుబంధం ఆత్మీయతలు కలగలసిన స్వచ్ఛమైన ప్రేమ ఆప్యాయతలు పంచే నిత్యసంతోషి సోదరుడు అంజిబాబుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆ దేవుని ఆశీస్సులు నిత్యం నీపై ఉండాలని, నీ చదువులో, వృత్తిలో, పని పాటల్లో విజయాలను ఆస్వాదిస్తూ అనేక పుట్టినరోజులు సుఖసంతోషాలతో జరుపుకోవాలని, మీ కుటుంబం ఫలించి విస్తరించాలని, దేవుని కృప నిండుగా మీకు ఉండాలని ఆశిస్తున్నా.." అంటూ న్యాయవాది, జర్నలిస్టు మిత్రుడు కొండూరి కోటిబాబు, "హ్యాపీ బర్త్డే అంజిబాబు ఎంసిజె అన్నయ్య" అంటూ లవన్‌కుమార్, "మెనీ మోర్ హ్యాపీ రిటర్న్స్ అఫ్ ది డే అంజిబాబు సార్ .." అంటూ జర్నలిజం మిత్రురాలు వై.నదియా,"మంచోడు, మృధు స్వభావి, సెల్ఫీ స్టార్ అంజిబాబు బ్రదర్ కు హ్యాపీ పుట్టినరోజు శుభాకాంక్షలు" అంటూ తెలుగుప్రభ డిప్యూటీ చీఫ్ రిపోర్టర్ ప్రశాంత్, అలాగే.. స్నేహశీలి.. స్వచ్ఛమైన మనసు.. మనిషి అయిన అంజిబాబుకు హృదయ పూర్వక జన్మదిన శుభాకాంక్షలు అంటూ ఇతర మిత్రులు,ఈనాడు,ఆంధ్రజ్యోతి, నమస్తే తెలంగాణకు చెందిన కొందరు జర్నలిస్టు మిత్రులు అంజిబాబుకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మిత్రుడు, వివేకానంద్ నగర్‌లోని ఏరువాక టిఫిన్ సెంటర్ నిర్వాహకుడు అనిల్ అంజిబాబుకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

**మీ ప్రేమాభిమానాలకు హృదయపూర్వక**





**ధన్యవాదాలు:**

నా పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ పేరు పేరునా హృదయపూర్వక ధన్యవాదాలు. నాపై మీరు చూపే ప్రేమాభిమానాలకు సదా కృతజ్ఞుడిని, మీ ఆశీస్సులు, దీవెనలు, నాపై ఎప్పటికీ ఇలాగే ఉండాలని కోరుకుంటున్నాను.. అంటూ జర్నలిస్టు అంజిబాబు నాగుల అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

# లక్ష్మాపూర్ గ్రామంలో కొనసాగుతున్న ఎన్ఎస్ఎస్ వేసవి శిబిరం






ఎల్లారెడ్డి, మార్చి -30 (జన సంఘర్షణ )

లక్ష్మాపూర్‌లో గ్రామంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎల్లారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ వేసవి శిబిరం సోమవారంకు మూడవ రోజు కొనసాగుతుందని ప్రోగ్రాం ఇంచార్జ్ రాణి,చంద్రకాంత్ అన్నారు. విద్యార్థి వాలంటీర్లు సేవాభావంతో వివిధ సామాజిక కార్యక్రమాలలో పాల్గొని గ్రామంలో చైతన్యం కల్పించారు. మూడవ రోజు భాగంగా వాలంటీర్లు రక్షణ కొండ నిలయం శివాలయం పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టి, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి పరిసరాలను స్వచ్ఛంగా మార్చారు. ఈ కార్యక్రమం ద్వారా పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించారు. తదనంతరం షీ టీం సభ్యులు సుప్రజ , శ్రీశైలం శిబిరాన్ని సందర్శించి, వాలంటీర్లకు పోక్సో చట్టం, సైబర్ క్రైమ్‌లు, ఫోటో మార్ఫిడి (మార్ఫింగ్) వంటి అంశాలు ఇతర ముఖ్యమైన చట్టాలపై సమగ్ర అవగాహన కల్పించారు. శిబిరం ద్వారా యువతలో సేవా స్ఫూర్తి, సామాజిక బాధ్యత, చట్టాలపై అవగాహన మరింతగా పెరుగుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఇన్చార్జి రాణి, చంద్రకాంత్ వాల్ ఇంటర్లు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ సర్పంచ్‌లను ముందస్తుగా అరెస్టు చేసిన రూరల్ ఎస్సై మచ్చందర్ రెడ్డి


బోధన్ : మార్చి 30 (జన సంఘర్షణ )




బోధన్ మండల మాజీ సర్పంచ్‌లు అసెంబ్లీ ముట్టడి పిలుపు మేరకు బోధన్ రూరల్ ఎస్సై మచ్చందర్ రెడ్డి ముందస్తు అరెస్ట్ చేశారు. చేతకాని ప్రభుత్వం, సిగ్గుశరం లేని ప్రభుత్వం, మాజీ సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసి రెండున్నర సంవత్సరాలు గడిచిన పెండింగ్ బిల్లులు చెల్లించకుండ మాటి, మాటికి అరెస్ట్ లు చేయడం పిరికిపంద చర్య అన్నారు. దమ్ముంటే చేతనైతే పెండింగ్ బిల్లులు చెల్లించి చూపించండి అన్నారు. చేతకాక పోతే రాజీనామాలు చేసి మూసుకొని ఇండ్లల్లో కూర్చోండి. కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు వేల కోట్ల రూపాయలు నిధులు విడుదల చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం మాజీ సర్పంచ్ లకు ఇవ్వాల్సిన పెండింగ్ బకాయిలు చెల్లించక పోగా ఈ అరెస్ట్‌లు చేయడం చాలా దురదృష్టం తెలిపారు. ఈ అసెంబ్లీ సమావేశాలు ముగిసేలోపు మాజీ సర్పంచ్ ల పెండింగ్ బిల్లులు చెల్లించక పోతే అసెంబ్లీ ముట్టడి కాదు ఇంకా తీవ్ర మైన చర్యలు చేపడతాం అని డిమాండ్ చేశారు. అరెస్ట్ చేసిన మాజీ సర్పంచ్ లలో సిర్ప సుదర్శన్, నానా పటేల్,కోర్వ గంగాధర్, తారాచంద్, గంగారాం లు ఉన్నారు.

# కామారెడ్డిలో విశాల షాపింగ్ మాల్ ప్రారంభం

కామారెడ్డి, మార్చ్ 30 ( జన సంఘర్షణ )



కామారెడ్డి జిల్లా కేంద్రంలో ప్రముఖ సీనినటి నిధి అగర్వాల్ సందడి చేశారు. జిల్లా కేంద్రంలోని విశాల షాపింగ్ మాల్ ని ఆమె ప్రారంభించారు. షాపింగ్ మాల్ లో ఏర్పాటుచేసిన పూజా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ప్రముఖ సినీనటి నిధి అగర్వాల్‌ని చూసేందుకు అభిమానులు భారీగా షాపింగ్ మాల్ వద్దకు తరలివచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో షాపింగ్ మాల్ యజమానులు పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి దశ నుంచి ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కలిగి ఉండాలి

- ఎస్సై-2 బాలసుబ్రహ్మణ్యం

ఎల్లారెడ్డి, మార్చి- 30 (జన సంఘర్షణ )



ప్రతి విద్యార్థులు విద్యార్థి ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన పెంచుకోవాలని ఎల్లారెడ్డి ఎస్సై-2 బాలసుబ్రమణ్యం అన్నారు. సోమవారం ఎల్లారెడ్డి పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్, రోడ్ సేఫ్టీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ.. విద్యార్థులు ట్రాఫిక్ చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. రహదారి భద్రత నియమాలు పాటించాలని, జీబ్రా క్రాసింగ్ వద్ద మాత్రమే రోడ్డు దాటాలని తెలిపారు. ద్విచక్ర వాహనంపై ప్రయాణించే వారు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ లేకుంటే ప్రమాద బీమా లభించదని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపరాదని, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, కానిస్టేబుల్ మధుసూదన్ రెడ్డి, సిబ్బంది ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# డిగ్రీ అడ్మిషన్ కోసం డోర్ టు డోర్ కంపెయినింగ్

ఎల్లారెడ్డి, మార్చి -30 (జన సంఘర్షణ)



ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రజా పాలనలో భాగంగా సోమవారం గండిమాసానిపేట్ గ్రామంలో డోర్ టు డోర్ కంపెయినింగ్ నిర్వహించడం జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. అడ్మిషన్ కంపెయినింగ్ లో భాగంగా కళాశాల అర్థ శాస్త్ర అధ్యాపకులు కృష్ణ ప్రసాద్ భౌతిక శాస్త్ర అధ్యాపకులు దశరథం, డోర్ టు డోర్ కంపెయినింగ్ కార్యక్రమం చేసి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎల్లారెడ్డిలో గల సదుపాయాలను వివరించారు. కళాశాల గురించి వివరించి గర్ల్స్ హాస్టల్, బాయ్స్ హాస్టల్ వేరు వేరు సదుపాయాలు ఉన్నాయని విద్యార్థులకు వారి తల్లితండ్రులకు తెలిపారు.డిగ్రీ అడ్మిషన్స్ దోస్త్ ఆన్ లైన్ ద్వారా అడ్మిషన్ చేసుకోవాలి అని అధ్యాపకులు తెలిపారు. విద్యార్థిని, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# భైంసాలో అతిథి అధ్యాపక నియామకానికి దరఖాస్తులు ఆహ్వానం

భైంసా, మార్చ్30 (జన సంఘర్షణ)

భైంసా: గోపాల్ రావ్ పాటిల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర విభాగంలో అతిథి అధ్యాపక నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కర్రోల్ల బుచ్చయ్య తెలిపారు. ఇంగ్లీష్, తెలుగు మీడియాల్లో బోధించగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. నెట్, సెట్, పీహెచ్‌డీ అర్హతలు కలిగినవారికి మరియు అనుభవం ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఏప్రిల్ 1, 2026 సాయంత్రం 5 గంటల వరకు కళాశాల కార్యాలయంలో తమ దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. ఇంటర్వ్యూ ఏప్రిల్ 2, 2026 ఉదయం 11 గంటల నుంచి నిర్వహించబడుతుందని, అభ్యర్థులు తమ విద్యార్హత సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు ప్రిన్సిపాల్‌ను 9963308287 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం తెలుగు దినపత్రిక
మంగళవారం
31 మార్చి 2026

# బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ: హామీల రాజకీయాలా? నిజమైన అభివృద్ధి ఎప్పుడూ?

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు ప్రతినిధి :(జన సంఘర్షణ)
సంవత్సరాలుగా వార్తల్లో నిలిచిన బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ అంశం ప్రస్తుతం పూర్తిగా పక్కన పడిపోయిందన్న భావన ప్రజల్లో నెలకొంది. ఒకప్పుడు ప్రతి రాజకీయ పార్టీ తమ మానిఫెస్టోలలో ప్రధానంగా ప్రస్తావించిన ఈ ప్రాజెక్ట్, ఇప్పుడు అమలు దిశగా ఎలాంటి కదలికలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గతంలో పలువురు ప్రముఖ నాయకులు బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీపై భారీ హామీలు ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయకపోతే రాష్ట్ర ప్రభుత్వం స్వయంగా స్టీల్ ఫ్యాక్టరీ నిర్మిస్తుందని, స్థానికులకు పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పిన మాటలు ఇప్పటికీ నెరవేరలేదు. మరోవైపు, బయ్యారం ఇనుము ఖనిజం నాణ్యత సరిపోదని కొందరు నాయకులు వ్యాఖ్యానించడం కూడా వివాదానికి దారితీసింది. అయితే ప్రజలు లేవనెత్తుతున్న ముఖ్య ప్రశ్న ఏమిటంటే.. నాణ్యత లేకపోతే గతంలో అక్కడి నుంచి ఇనుము ఖనిజాన్ని విశాఖకు ఎందుకు తరలించారు? ఉపయోగం లేకుంటే రవాణా ఎందుకు జరిగింది? ఉపయోగం ఉండటం వల్లే ఆ చర్యలు తీసుకున్నారని స్థానికులు అంటున్నారు. అప్పట్లో అక్కడే స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలన్న ఆలోచనలు వచ్చినప్పటికీ, అవి అమలు దశకు చేరకముందే నిలిచిపోయాయి. ఇక ప్రస్తుత ప్రజాప్రతినిధులపై కూడా




విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్థానిక ఎమ్మెల్యే అసెంబ్లీలో గానీ, మీడియా వేదికలపై గానీ బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ అంశాన్ని బలంగా ప్రస్తావించలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ సహా అన్ని పార్టీలు ప్రజలకు పలు హామీలు ఇస్తున్న నేపథ్యంలో, బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ అంశాన్ని మాత్రం మానిఫెస్టోకే పరిమితం చేస్తున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రజలు స్పష్టం చేస్తున్నది ఒక్కటే–బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీని నిజంగా తీసుకువచ్చే నాయకుడికి, ఆ పార్టీ ఏదైనా సరే మద్దతు ఇస్తామని చెబుతున్నారు. మాటలు కాదు, కార్యాచరణ కావాలని డిమాండ్ చేస్తున్నారు.

**ప్రజల డిమాండ్లు:**
బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీపై తక్షణ స్పష్టత ఇవ్వాలి. హామీలకే పరిమితం కాకుండా ప్రాజెక్ట్‌ను అమలు చేయాలి. స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. అన్ని రాజకీయ పార్టీలు తమ వైఖరిని స్పష్టంగా ప్రకటించాలి. బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీపై రాజకీయ పార్టీలు ఇకనైనా స్పష్టమైన నిర్ణయం తీసుకుని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని స్థానికులు కోరుతున్నారు. 'మాటలు చాలించాయి... ఇప్పుడు పనులు కావాలి' అనే నినాదంతో ప్రజలు ఎదురు చూస్తున్నారు.

# ప్రతి నెల రెండు మెడికల్ బోర్డులు నిర్వహించాలి

❑ సింగరేణి కార్మికుల డిమాండ్

భద్రాద్రి కొత్తగూడెం ఇల్లెందు ప్రతినిధి :(జన సంఘర్షణ )
సింగరేణి బొగ్గు గని కార్మికుల సమస్యల పరిష్కారానికి తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఉద్యమ బాట పట్టింది. రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొప్పుల ఈశ్వర్, రాష్ట్ర అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి పిలుపుమేరకు ఇల్లందు ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయం ముందు కార్మికులు నిరసన చేపట్టారు. అనంతరం జనరల్ మేనేజర్ వీసం కృష్ణయ్యకు వినతిపత్రం సమర్పించారు. కార్మికులు మాట్లాడుతూ, దేశ అభివృద్ధికి తమ ప్రాణాలను పణంగా పెట్టి పనిచేస్తున్న బొగ్గు గని కార్మికులు అనారోగ్యంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విధులకు హాజరు కాలేక జీతాలు కోల్పోయి అప్పుల పాలవుతూ కుటుంబాలను పోషించలేని పరిస్థితులు నెలకొన్నాయని వాపోయారు. బొగ్గు గనుల్లో పని పరిస్థితులు ఇతర పరిశ్రమలతో పోలిస్తే ప్రమాదకరమని, కాలుష్యం, ప్రాణహాని పరిస్థితుల్లో పనిచేయాల్సి వస్తోందని తెలిపారు. ఈ నేపథ్యంలో గతంలో కార్మికుల వారసులకు ఉద్యోగాలు కల్పించే విధానం అమల్లోకి తీసుకువచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. అయితే, ఇటీవల కాలంలో మెడికల్ బోర్డులు




నిర్వహించకపోవడం వల్ల అర్హులైన కార్మికులకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రతి నెల రెండు మెడికల్ బోర్డులు నిర్వహిస్తామని ఇచ్చిన హామీలు నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కారుణ్య నియామకాలలో అవినీతి ఆరోపణల పేరుతో మెడికల్ బోర్డు నిర్వహణను నిలిపివేయడం సరైనది కాదని పేర్కొన్నారు. విచారణలు కొనసాగుతూనే మెడికల్ బోర్డులు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

**కార్మికుల ప్రధాన డిమాండ్లు:**
ప్రతి నెల రెండు మెడికల్ బోర్డులను నిరంతరాయంగా నిర్వహించాలి. అనారోగ్యంతో పనికి అనర్హులైన కార్మికులను వెంటనే గుర్తించాలి. వారి వారసులకు ఆలస్యం లేకుండా ఉద్యోగ నియామకాలు ఇవ్వాలి. గతంలో అర్హులైనా మెడికల్ బోర్డు పొందని కార్మికులకు మళ్లీ అవకాశం కల్పించాలి. విజిలెన్స్, మారుపేర్ల సమస్యలను త్వరగా పరిష్కరించాలి. ఏడాది నుంచి ఎదురు చూస్తున్న రెండు వేల మందికి పైగా కార్మికులకు న్యాయం చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన భారీ బకాయాలను వెంటనే విడుదల చేయాలి. సింగరేణి యాజమాన్యం, ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సంఘ నాయకులు డిమాండ్ చేశారు. లేకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి: సీఐ రవీందర్ నాయక్

❑ తానూర్ లో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం
❑ 65 వాహనాలు సీజ్



తానూర్, మార్చి 30: (జన సంఘర్షణ)
ప్రజలు తప్పనిసరిగా వాహన పత్రాలు వెంట తీసుకుని ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని సీఐ రవీందర్ నాయక్ సూచించారు. తానూర్ గ్రామంలో సోమవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు అశోక్, బిట్ల పెర్సిస్, జుబేర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో విస్తృతంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. తనిఖీలలో వాహన పత్రాలు లేని వారు, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకున్నారు. మొత్తం 65 వాహనాలను సీజ్ చేయగా, అందులో 60 రెండు చక్రాల వాహనాలు, 5 ఆటోలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అదేవిధంగా జరిమానా వసూలు ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు పేర్కొన్నారు. ప్రజలు చట్టాలను గౌరవించి సురక్షితంగా ప్రయాణించాలని సీఐ సూచించారు.

# ఎమ్మెల్యే మదన్ మోహన్ చిత్రపటానికి పాలాభిషేకం

ఎల్లారెడ్డి, మార్చి- 30 ( జన సంఘర్షణ)
ఎల్లారెడ్డి పట్టణ పరిధిలో నూతనంగా నిర్మాణ మైన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ వేడుకలు సంద ర్భంగా సోమవారం ఎల్లారెడ్డి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే మదన్మోహన్ చిత్ర




పటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజాప్రతినిధులు పాలాభిషేకం చేశారు. శాసనసభ్యులు మదన్ మోహన్ సూచనల మేరకు ఈ గృహప్రవేశ కార్యక్రమాలు నిర్వహించ బడిందని ఈ సందర్భంగా వారు అన్నారు. ఇళ్లను పొందిన లబ్ధిదారులు ఎమ్మెల్యేకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తూ, ఎల్లప్పుడూ ఆయనకు అండగా ఉంటామని పేర్కొన్నారు. ప్రత్యేకంగా, 10వ వార్డులో ఒక గృహప్రవేశం 12వ వార్డులో గృహ ప్రవేశం చేయడం జరిగిందని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ద్వారా పేద ప్రజల సొంత ఇంటి కల నెరవేరడంతో అందరూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. జరిగిన గృహప్రవేశ కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య విజయవంతంగా జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచ్లు, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆలస్యం అవుతున్న నూతన సిసి రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలి

❑ గాంధీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్

హైదరాబాద్ సిటిబ్యూరో /మార్చ్ 30 ( జనసంఘర్షణ )



అరుంధతి నగర్ బస్తీలో గతంలో ప్రారంభించిన సిసి రోడ్డు నిర్మాణం పనులను గాంధీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్ సోమవారం జి ఎచ్ఏంసి ఇంజనీరింగ్ అధికారులు అసిస్టెంట్ ఇంజనీర్ అబ్దుల్ సలామ్ ,వర్క్ ఇన్స్పెక్టర్ మహేష్, వాటర్ వర్క్స్ డిజిఎం వెంకట్ రెడ్డి, లైన్ ఇన్స్పెక్టర్ శంకర్ వారి సిబ్బందితో కలిసి అరుంధతి నగర్‌లో పర్యటించారు. బస్తీ వాసుల ఫిర్యాదు మేరకు పనులు నత్తనడకన సాగుతున్నాయనీ, త్వరగతీన పూర్తి చేయాలని మాజీ కార్పొరేటర్ అధికారులను కోరారు. సి సి రోడ్డు నిర్మాణం పనులు పూర్తి చేసి మరో వారం రోజుల్లో ప్రజల అందుబాటులోకి తెస్తామనీ అలాగే పూర్తైన పైప్ లైన్ పనుల అనంతరం మిగిలివున్న రోడ్డు ప్యాచ్ వర్క్ పనులు సైతం వెంటనే పూర్తి చేయాలని వాటర్ వర్క్ అధికారులను ఆదేశించారు. గాంధీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్ అన్నారు. కార్యక్రమంలో బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, బిజెపి సీనియర్ నేతలు శ్రీకాంత్, ఎం.ఉమేష్, ఆనంద్ రావు, జ్ఞానేశ్వర్, బస్తీ వాసులు శ్రీనివాస్ గౌడ్, ప్రకాష్, సతీష్, పవన్ ,బాబీ, కైలాష్ తదితరులు పాల్గొన్నారు.

# కడియం శ్రీహరిని ఉద్దేశించి మాట్లాడిన మాటలను ఖండిస్తుంది..

❑ టీటీడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి జె. దశరథ్...

హైదరాబాద్ సిటిబ్యూరో /మార్చ్ 30(జనసంఘర్షణ )



ఇటీవల సాక్షాతూ అసెంబ్లీ సాక్షిగా భారత రాష్ట్ర సమితికి చెందిన ఒక దళిత ఎమ్మెల్సీ అసెంబ్లీలో ఎమ్మెల్యేను పార్టీలు వేరైనా ఆ దళిత ఎమ్మెల్యేను ఉద్దేశించి భారత రాష్ట్ర సమితికి చెందిన పాడి కౌశిక్ రెడ్డి దళిత ఎమ్మెల్యేను ఉద్దేశించి తనగన్ తో కాల్చి పారేస్త తొక్కి పారేస్త....అనడం ఆన్ ది అసెంబ్లీ హాల్‌లోని రికార్డును తెలంగాణ అసెంబ్లీ సెక్రెటరీ ఆ రికార్డును పరిగణలోకి తీసుకొని ఆ ఎమ్మెల్సీ పదవికి అనర్హుడిగా అసెంబ్లీ సెక్రెటరీతోపాటు అతడిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి హైకోర్టు దృష్టికి పోలీసులు వెంటనే తీసుకు వెళ్లాలని తెలుగు దేశం పార్టీ జాతీయ ప్రచార కార్యదర్శి జె దశరథ్ అసెంబ్లీ సెక్రెటరీకి విజ్ఞప్తి చేశారు. అట్లాగే భారత రాష్ట్ర సమితికికి చెందిన వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దళిత ఎమ్మెల్యేను ఉద్దేశించి మాట్లాడిన మాటలను బీఆర్ఎస్ పార్టీ ఖండించాలని ఈసందర్భంగా టీటీడిపి జాతీయ కార్యదర్శి దశరథ్ స్పష్టం చేశారు . దళితుల పట్ల పాడి కౌశిక్ రెడ్డి మాటలను ప్రతి పార్టీలకు చెందిన వారు ఖండించాలని అన్నారు.

# డిమాండ్ల సాధనకు ఆశా వర్కర్ల పోరాటం

ముధోల్, మార్చ్ 30 (జన సంఘర్షణ)




రాష్ట్రవ్యాప్తంగా తమ న్యాయంవరమైన డిమాండ్ల సాధన కోసం శాంతియుతంగా జాతీయ రహదారుల బంద్ పిలుపు మేరకు ధర్నాను ఆశా కార్యకర్తలు పూనుకున్నారు. దీంతో సోమవారం మండల కేంద్రంలోని ఆశ కార్యకర్తలను ఎస్సై బిట్ల పెర్సిస్ వేకువజామున ఇండ్లలోకి వెళ్లి ముందస్తుగా అరెస్ట్ చేసే పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలు మాట్లాడుతూ.. పోలీసుల అక్రమ అరెస్టులు సరికాదని అగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆశా కార్యకర్తల రూ.18వేల జీతం పెంచుతామని నమ్మబలికారు. చాలీచాలని వేతనాలతో కుటుంబ గడుపుతున్నామని పేర్కొన్నారు. తమ న్యాయపరమైన డిమాండ్లు వెంటనే పరిష్కరించాలన్నారు. ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని లేనియెడల వచ్చే జూన్ నెలలో రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మెను చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు బి విజయలక్ష్మి, కే లక్ష్మి, గంగామణి, పుష్పలత, స్రవంతి, సుజాత, రాధా, సరస్వతితో పాటు తదితరులు పాల్గొన్నారు.

# పంట పొలాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన రైతులు

ముధోల్, మార్చ్30 (జనసంఘర్షణ):



మండల కేంద్రమైన ముధోల్తో పాటు వివిధ గ్రామాల్లో సోమవారం రైతులు అంబలి బార్సి పండుగను ఘనంగా జరుపుకున్నారు. అంబలి బార్సి పండుగను పురస్కరించుకొని రైతులు వేకువజామునే తమ పంట పొలాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంటలు సమృద్ధిగా పండాలని ప్రతి ఒక్కరు ఆయురారోగ్యలతో ఉండాలని మొక్కలు చెల్లించుకున్నారు. అదేవిధంగా వేసవి పనులను పూజ అనంతరం పంట పొలాల్లో ప్రారంభిస్తారు. ఉగాది తర్వాత రైతులు అంబలి బార్సి పండుగను ఘనంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. రైతులు పంట పొలాల్లో పూజా కార్యక్రమాలు అనంతరం తమ ఇరుగుపొరుగు వారిని విందుకు ఆహ్వానించారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా అంబలి బార్సి పండుగ సందడి కనిపించింది.

## సింగరేణి మండల తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన ఓరుగంటి వెంకటేశ్వర్లుని కలిసిన సర్పంచ్ పొడుగు పెంటయ్య

30-03-2026
సింగరేణి



సింగరేణి మండల ఆఫీస్ నందు నూతన తహసీల్దార్ ని కలిసి శాలువాతో ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలిపిన వెంట్లగూడెం సర్పంచ్ పొడుగు పెంటయ్య, టేకుల గూడెం సర్పంచ్ గుమ్మడి సందీప్, టీపీసీసీ వైరా అసెంబ్లీ సోషల్ మీడియా కో -ఆర్డినేటర్ కనకం పవన్ కళ్యాణ్. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ మండలంలోని ప్రజలకు ప్రభుత్వ సేవలను వేగంగా, పారదర్శకంగా అందిస్తామని హామీ ఇచ్చారు. భూ సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాల అమలులో ప్రత్యేక శ్రద్ధ వహిస్తానని, సిబ్బంది సమన్వయంతో ప్రజలకు అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు.. ఈ కార్యక్రమంలో వివిధ హోదాలో గల నాయకులు పాల్గొన్నారు.

## కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లు రద్దు చేయాలి

◆ **ఏప్రిల్ 1 బ్లాక్ డేకు పిలుపు**

భద్రాద్రి కొత్తగూడెం ఇల్లందు, మార్చి 30( జన సంఘర్షణ)




కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని తెలంగాణ హామాలి, మిల్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్టియు) రాష్ట్ర అధ్యక్షులు కొక్కు సారంగపాణి డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 1న కార్మిక సంఘాలు చేపట్టనున్న బ్లాక్ డే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సోమవారం ఇల్లందు మండలంలోని ముకుందాపురం క్యాంపు సెంటర్‌లో నిర్వహించిన హమాలీల జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల హక్కులను దెబ్బతీసే విధంగా ఉన్న లేబర్ కోడ్లను అమలు చేయకుండా తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయాలని కోరారు. హమాలి కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కూడా ఆయన డిమాండ్ చేశారు. కార్మికుల జీవనోపాధి, భద్రత, హక్కుల పరిరక్షణ కోసం సంఘాలు ఐక్యంగా పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తొండల సర్వయ్య, ఐలు ఉప్పలయ్య, కోరం నాగేష్, జె. సురేష్, సైదులు తదితరులు పాల్గొన్నారు. ఉద్యమాభివందనాలతో, కొక్కు సారంగపాణి రాష్ట్ర అధ్యక్షులు, తెలంగాణ హామాలి ఢ మిల్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్టియు).

## మానసిక ఆరోగ్యంపై అంకితభావంతో సేవలు

**- డా. హిప్నో పద్మా కమలాకర్‌కు ప్రతిష్ఠాత్మక అవార్డు**

హైదరాబాద్ సిటీబ్యూరో /మార్చ్ 30( జనసంఘర్షణ )




సమాజంలో పెరుగుతున్న మానసిక సమస్యలపై అవగాహన కల్పిస్తూ, వేలాది మంది విద్యార్థులు, కుటుంబాలు, భార్యాభర్తల జీవితాల్లో మార్పు తీసుకువచ్చిన ప్రముఖ సైకో థెరపిస్ట్, హిప్నో థెరపిస్ట్ డా. హిప్నో పద్మా కమలాకర్‌కి లయన్స్ ఇంటర్ నేషనల్ డిస్ట్రిక్ట్ 320ఏ ఆధ్వర్యంలో ఘనంగా "లయన్స్ ఉగాది జాతీయస్థాయి పురస్కారం -2026" ప్రదానం చేశారు. సికింద్రాబాద్‌లో జరిగిన ఈ ప్రతిష్ఠాత్మక వేడుకలో ముఖ్య అతిథులుగా హాజరైన లయన్స్ గవర్నర్ డా. మహేంద్ర కుమార్ రెడ్డి, టి.నైనాదేవి, డా. సూర్యనారాయణ కలిసి ఈ అవార్డును అందజేశారు.విద్యార్థుల్లో పరీక్షల ఒత్తిడి నుంచి బయటపడే మార్గాలు, కుటుంబాల్లో భావోద్వేగ సమతుల్యత, భార్యాభర్తల మధ్య పరస్పర అవగాహన వంటి అంశాలపై డా. పద్మా కమలాకర్ ప్రేరణాత్మక కార్యక్రమాలు సమాజంలో విశేష ప్రభావం చూపుతున్నాయని అతిథులు ప్రశంసించారు.'మానసిక ఆరోగ్యం బలంగా ఉంటేనే సమాజం బలంగా ఉంటుంది' అనే సందేశంతో ఆమె చేస్తున్న సేవలు అభినందనీయం అని వారు పేర్కొన్నారు. అవార్డు స్వీకరించిన డా. హిప్నో పద్మా కమలాకర్ గారు మాట్లాడుతూ.. 'ప్రతి విద్యార్థి ఒత్తిడిని జయించి విజయం సాధించాలి..ప్రతి కుటుంబం ఆనందంగా జీవించాలి.. ఇదే నా లక్ష్యం' అని తెలిపారు.ఈ కార్యక్రమానికి లయన్స్ క్లబ్ ప్రతినిధులు, ప్రముఖులు, ఆహ్వానితులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## అరుణాచలేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

సదుం మార్చి 30, జనసంఘర్షణ :



సదుం పంచాయతీ దిగువ జాంద్రపేటలో వెలసిన శ్రీ అరుణాచలేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం విశేషంగా వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం ఆలయం వద్ద నందీశ్వరునికి ప్రదోష పూజ వేద పండితులు వైభవంగా నిర్వహించారు.

# ఇందిరమ్మ ఇళ్ల పంపిణీలో అవకతవకల ఆరోపణలు

◆ **సింగరేణి మండలంలో వివాదం**

ఖమ్మం జిల్లా, సింగరేణి :( జన సంఘర్షణ)




పేదలకు సొంతింటి కల నెరవేర్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం సింగరేణి మండలంలో వివాదాలకు దారితీస్తోంది. ఇళ్ల పంపిణీ ప్రక్రియలో పారదర్శకత లేకపోవడం, అర్హులకు న్యాయం జరగకపోవడం వంటి ఆరోపణలు స్థానికంగా తీవ్ర చర్చకు దారి తీస్తున్నాయి. గ్రామాల్లో సంవత్సరాలుగా ఇల్లు కోసం ఎదురు చూస్తున్న పేద కుటుంబాల పేర్లు జాబితాల్లో లేకపోవడం, మరోవైపు రాజకీయ అనుబంధం ఉన్న కొందరికి ప్రాధాన్యత ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో నిజంగా అవసరమైన పేదలు, కూలీలు, రైతు కుటుంబాలు నిరాశ చెందుతున్నాయని స్థానికులు అంటున్నారు. ప్రభుత్వం సూచించిన విధంగా ఇందిరమ్మ కమిటీల ద్వారా అర్హుల ఎంపిక జరగాల్సి ఉన్నప్పటికీ, కింది స్థాయిలో ఆ నిబంధనలు పాటించడం లేదని ఆరోపణలు ఉన్నాయి. కొన్ని చోట్ల కమిటీ సమావేశాలు సక్రమంగా నిర్వహించకుండా, రహస్యంగా పేర్లు చేర్చుతున్నారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ప్రభావశీలుల ఒత్తిళ్లతో జాబితాలు తయారవుతున్నాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసి నాయకుడు గుగులోత్ తేజ్య నాయక్ తీవ్రంగా స్పందించారు. ఇళ్ల పంపిణీ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా జరగడం లేదని, అర్హులైన పేదలను పక్కన పెట్టి రాజకీయ అనుకూలతల ఆధారంగా కేటాయింపులు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. పేదల సంక్షేమం కోసం రూపొందించిన పథకాలను రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవడం సరైనది కాదని ఆయన అన్నారు. సింగరేణి మండలంలోని అన్ని గ్రామాల్లో ఇళ్ల పంపిణీపై సమగ్ర విచారణ జరిపి, అవకతవకలు నిరూపితమైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిజంగా ఇల్లు అవసరమైన పేద కుటుంబాలను గుర్తించి వారికి న్యాయం చేయాలని, ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ పూర్తిగా పారదర్శకంగా జరగాలని ప్రజలు కోరుతున్నారు.

## దివ్యాంగులకు ఫిజియోథెరపీ పరీక్షలు

ఎల్లారెడ్డి, మార్చి -30 (జన సంఘర్షణ )



ఎల్లారెడ్డి మండలంలోని భవిత భవనంలో దివ్యాంగులకు ఫిజియోథెరపీ పరీక్షలు నిర్వహించారు. అందులో భాగంగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన 8 మంది విద్యార్థిని విద్యార్థులకు ఫిజియోథెరపీ చికిత్సలు చేశారు. ఫిజియోథెరపీ చేయడం వల్ల కొంత ఉపశమనం లభిస్తుందని ఎంఈఓ రాజులు, ఫిజియోథెరపిస్టు అరుణ్ తెలిపారు. దివ్యాంగులు ఎలాంటి నిరుత్సాహ పడకుండా అన్ని రంగాలలో ముందుకు పోవాలని సూచించారు. ఇంటి వద్ద చేసుకునే వ్యాయామాల గురించి తెలిపారు.కార్యక్రమంలో సిబ్బంది వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ జడ్పీటీసీ, ఏఎంసీ చైర్పర్సన్ లక్ష్మి మృతి

కామారెడ్డి /మార్చ్ 30/(జన సంఘర్షణ)



ఉమ్మడి మాచారెడ్డి మండల మాజీ జడ్పీటీసీ, కామారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్పర్సన్ గ్యార లక్ష్మి సోమవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో తుది శ్వాస విడిచారు. వారం రోజుల క్రితం బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో హైదరాబాద్లోని కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆమె మరణించారు. ఇటీవల ఆమె కూతురు గ్యార అఖిల కామారెడ్డి మున్సిపల్ కౌన్సిలర్ గా గెలుపొందారు. ఆమె మృతితో పోతారం, మాచారెడ్డి మండలం, కామారెడ్డి జిల్లా కేంద్రంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మంగళవారం ఆమె స్వగ్రామమైన పోతారంలో అంత్యక్రియలు జరగనున్నాయి.

# సింగరేణి హెడ్ ఆఫీస్ ముట్టడి ఉద్రిక్తం... నేతల అరెస్టు

◆ **పోలీసులతో తోపులాట... కార్మికుల ఆగ్రహం భగ్గుమన్న కొత్తగూడెం**

భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 30 ( జన సంఘర్షణ)





సింగరేణి పరిరక్షణతో పాటు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం వర్కర్స్ యూనియన్ చేపట్టిన సింగరేణి హెడ్ ఆఫీస్ ముట్టడి ఉద్రిక్తతకు దారితీసింది. కోల్ బెల్ట్ ప్రాంతాల నుంచి వేలాది మంది కార్మికులు, యూనియన్ కార్యకర్తలు భారీ ర్యాలీగా తరలి వచ్చి హెడ్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు. ప్రధాన ద్వారం ముందు బైఠాయించి, పొర్లు దండాలతో వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. దాదాపు మూడు గంటల పాటు సాగిన ఈ ధర్నాను పోలీసులు అడ్డుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ క్రమంలో నేతలు, పోలీసుల మధ్య తీవ్ర వాగ్వివాదం, తోపులాట చోటుచేసుకుంది. సిపిఐ జాతీయ నాయకుడు డాక్టర్ కె. నారాయణ, జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా, యూనియన్ నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్ కుమార్ తదితరులను పోలీసులు నిర్బంధించి 1 టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టులకు ముందు కార్మికులను ఉద్దేశించి డాక్టర్ కె. నారాయణ మాట్లాడుతూ, సింగరేణి సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన రూ. 50 వేల కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి వెంటనే స్పందించి నిధుల విడుదలపై స్పష్టత ఇవ్వాలని కోరారు. కొత్త గనుల ప్రారంభంపై యాజమాన్యం నిర్లక్ష్యం సంస్థ భవిష్యత్తుకు ముప్పు అని, ఏసీబీ విచారణ పేరుతో మెడికల్ బోర్డును నిలిపివేయడం కార్మికుల జీవితాలతో చెలగాటమాడటమేనని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సింగరేణి సంపదను దోచుకుంటున్నాయని ఆరోపిస్తూ, కార్మికుల కష్టంతో నడిచే సంస్థలో రాజకీయ జోక్యం పెరిగిందని మండిపడ్డారు. అదేవిధంగా కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు అమలు చేయాలని, డిపెండెంట్ల ఉద్యోగాల విషయంలో ఆలస్యం చేస్తే తీవ్ర ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. డిమాండ్లు నెరవేర్చకపోతే సమ్మె సైరన్ మోగిస్తామని స్పష్టం చేశారు. కార్మికుల ఆందోళనలతో సింగరేణి ప్రాంతం ఉద్రిక్తంగా మారగా, రాబోయే రోజుల్లో మరింత తీవ్ర పోరాటాలకు సంకేతాలు కనిపిస్తున్నాయి.

# సారంగాపూర్ లో అర్ధరాత్రి కత్తిపోట్ల కలకలం

◆ **అక్కడికక్కడే యువకుడు మృతి**

కామారెడ్డి/మార్చ్ 30/(జన సంఘర్షణ)

నిజామాబాద్ జిల్లాను ప్రశాంత వాతావరణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా, ప్రజలకు స్వేచ్ఛ వాయు ఇవ్వాలని సంకల్పంతో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి సాయి చైతన్య ఎప్పటికప్పుడు గ్రామాలు, మండలాలు, యువకులతో, మహిళలతో చైతన్య సదస్సులు నిర్వహిస్తూ ప్రజల్ని ఒకవైపు చైతన్యం పరుస్తుంటే మరొకవైపు నిజామాబాద్ జిల్లాలో హత్యలు కొనసాగుతున్నాయి. ఈ హత్యలు పోలీసులకు సవాల్గా నిలుస్తున్నాయి. తాజాగా.నిజామాబాద్ జిల్లా సారంగపూర్లో అర్ధరాత్రి కత్తిపోట్ల కలకలం చోటు చేసుకుంది. అంతకులు, మెకానిక్ అక్షయ్ (35) ఇంట్లోకి చొరబడి కత్తులతో దాడి చేయడంతో ఆయన తీవ్రగాయాలతో మృతి చెందాడు. ఈ ఘటనకు పాత కక్షలే కారణమై ఉంటాయని పోలీసులు అనుమానిస్తున్నారు..



జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం · తెలుగు దినపత్రిక
మంగళవారం
31 మార్చి 2026

# పేదల ఆకలి తీరుస్తూ.. రైతుకు భరోసానిస్తూ: 'సన్నబియ్యం' పథకం

తెలంగాణ/మార్చ్ 30/(జన సంరక్షణ)
ఆహార కల్తీని నియంత్రించడానికి రాష్ట్రంలో ఒక ప్రత్యేక వ్యవస్థను తీసుకొస్తామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో కొత్తగా తీసుకొచ్చిన ఈగల్, హైడ్రా తరహాలోనే ఆహార కల్తీని నియంత్రించడానికి కూడా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తామన్నారు. ఇందుకోసం దేశంలో ప్రస్తుతం అమలవుతున్న కల్తీ నిరోధక చట్టాలను అధ్యయనం చేసి పటిష్టమైన చర్యలు చేపడుతామని చెప్పారు. రాష్ట్రంలో 3.39 కోట్ల మందికి పంపిణీ చేస్తున్న సన్నబియ్యం పథకం ప్రారంభమై ఏడాది పూర్తయిన సందర్భంగా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులకు శాసనసభ సెంట్రల్ హాలులో సన్నబియ్యంతో భోజనం ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రితో పాటు మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి , స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్



కుమార్ రెడ్డితో పాటు మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొని భోజనం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మీడియాతో ముచ్చటిస్తూ.. "రేషన్ షాపుల ద్వారా దొడ్డుబియ్యం అందించినా తినేవారు లేకపోవడంతో ఆ బియ్యాన్ని సన్నబియ్యంగా మార్చే మాఫియా పెరిగిపోయింది. పైగా దొడ్డు బియ్యం ఇవ్వడం వల్ల ప్రభుత్వానికి ఖర్చు తప్ప పేదలకు ఉపయోగపడటం లేదు. అన్ని రకాలుగా ఆలోచనలు చేసిన తర్వాత పేదలు తినగలిగే సన్నబియ్యం అందించాలని ఈ పథకాన్ని ప్రారంభించాం. ఇందుకోసమే క్వింటాలుకు 500 రూపాయల బోనస్ ప్రకటించి సన్నవడ్లు పండించాలని రైతులను ప్రోత్సహించాం. అడిగిన ప్రతి వారికి రేషన్ కార్డు జారీ చేశాం. ఇదే తరహాలో రాష్ట్రంలో విద్యార్థులకు నాణ్యమైన విద్య, పోషకాహారం అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈ క్రమంలో పంట మార్పిడి విధానాలపై రైతుల్లో అవగాహన కల్పిస్తాం. వాణిజ్య ఇతర పంటల వైపు రైతులను ప్రోత్సహిస్తాం.." అని ముఖ్యమంత్రి అన్నారు.

# కోటగిరిలో ఘనంగా హిరాట్ హిందూ సమ్మేళనం

◆ పిల్లలకు ధర్మాన్ని, సంస్కారాన్ని నేర్పాలి..

కోటగిరి. / మార్చ్30/(జన సంఘర్షణ)
మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో ఏర్పాటు చేసిన హిందూ విరాట్ సమ్మేళనం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాలయోగి పిట్లకు కృష్ణ మహారాజ్ హాజరయ్యారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలకు చిన నాటి నుండే ధర్మాన్ని సంస్కరాన్ని నేర్పుతూ హిందూ ధర్మాన్ని కాపాడాలని తెలిపారు. మన దేశం వసుదైవ కుటుంబమని అంత రాముని బాటలో నడవాలన్నారు. భారతదేశంలో ఉన్న వారంతా హిందువులేనని, హిందుత్వం మన జీవన విధానం అని పేర్కొన్నారు. పిల్లలకు నిస్వార్థం ధనా గుణం దయ నేర్పాలని తల్లిదండ్రులకు సూచించారు. లవ్ జిహాద్ వంటి వాటిపై వైపు మరలకుండా జాగ్రత్త చూసుకోవాలని తెలిపారు. అలా కాకుండా వివాహ బంధంలో సీతారాముల మార్గంలో నడిచేలా తీర్చిదిద్దాలని సూచించారు. దేశ మహనీయులు చత్రపతి శివాజీ, రుద్రమదేవి, ఝాన్సీ లక్ష్మీబాయి, వంటి మహా వీరనారులు వీరమనల నడిచిన నచ్చిన సద్భాగాలను వారికి బోధించాలన్నారు. సెల్ఫోన్ సామాజిక మధ్య మాలకు దూరంగా ఉండాలని



యువతకు తెలిపారు. పిల్లలకు ఆధ్యాత్మిక వైపు అడుగులు వేసేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బర్ల మధుకర్ మండల ప్రజా ప్రతినిధులు పోలవితలావు గుప్తా అయ్యప్ప ఆలయ కమిటీ నిర్వహకులు విధద గ్రామాల సర్పంచులు వివిధ గ్రామాల హిందూ సంఘాల నాయకులు మండల హిందూ వాహిని కమిటీ నిర్వాకులు తదితరులు పాల్గొన్నారు.

## బారాస ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయడానికి నిరసిస్తూ బోర్లలో రాష్ట్ర ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దగ్ధం





బాన్సువాడ/మార్చ్ 30/(జన సంఘర్షణ)
తెలంగాణ అసెంబ్లీ నుండి 24 మంది బిఆర్ఎస్ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ సోమవారం బొర్లం గ్రామ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మని దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ ప్రతిపక్షం గొంతు నొక్కడమే ధ్యేయంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని, ప్రజా సమస్యలపై నిలదీస్తుంటే సమాధానం చెప్పలేక, ఏకపక్షంగా 24 మంది ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయడం "ప్రజాస్వామ్య చీకటి రోజు" అని అభివర్ణించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి చెందిన సంస్థలపై వస్తున్న అక్రమ మైనింగ్ ఆరోపణలపై ప్రభుత్వం ఎందుకు భయపడుతోంది? నిజంగా తప్పు చేయకపోతే 'హౌస్ కమిటీ' వేయడానికి అభ్యంతరం ఏంటి?విచారణ జరపకుండా, అడిగిన వారిని సభ నుండి గెంటేయడం వెనుక ఉన్న మతలబు ఏంటి?

**బడ్జెట్‌పై చర్చ జరగకుండా కుట్ర:**రాష్ట్ర బడ్జెట్‌లో ప్రజలకు ఇచ్చిన హామీలు (రుణమాఫీ, ఆరు గ్యారెంటీలు) నెరవేర్చలేదని ప్రతిపక్షం నిలదీస్తుందనే భయంతోనే, చర్చకు అవకాశం ఇవ్వకుండా బీఆర్ఎస్ నేతలను బయటకు పంపేశారు. అధికార పార్టీ నేతలు గతంలో ఎన్నోసార్లు అసభ్యంగా ప్రవర్తించినా రాని 'ఎథిక్స్' ప్రతిపక్షం ప్రశ్నిస్తేనే గుర్తుకు వస్తాయా? కేవలం రాజకీయ కక్ష సాధింపు కోసమే ఎథిక్స్ కమిటీని వాడుకుంటున్నారు. అసెంబ్లీ లోపల గొంతు నొక్కినా, వీధి పోరాటాలు ఆపం. ప్రజల తరఫున ప్రశ్నలు అడుగుతూనే ఉంటాం. సస్పెన్షన్లతో ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోలేదు.ప్రభుత్వ అక్రమాలను ప్రశ్నిస్తే సస్పెండ్ చేస్తారా? ఇది ప్రజాస్వామ్యమా లేక నియంతృత్వమా? తక్షణమే సస్పెన్షన్ ఎత్తివేసి, మైనింగ్ అక్రమాలపై హౌస్ కమిటీ వేయాలి." అని బొర్లం బిఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.

## రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ఘన స్వాగతం

మార్చి 30, జన సంఘర్షణ:
రెండు రోజుల పాటు జిల్లా పర్యటన నిమిత్తం సోమవారం మధ్యాహ్నం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ గారికి ఘన స్వాగతం లభించింది. రాష్ట్ర గవర్నర్ తిరుపతి జిల్లాలో రెండు రోజుల పర్యటనలో భాగంగా రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ గోవిందరావు, టాస్పోర్స్ ఎస్పీ శ్రీనివాస్, శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జె వి. రమణ, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ శ్రీ హరి రావు, శ్రీ కాళహస్తి ఆర్ డి ఓ బానుప్రకాష్ రెడ్డి తదితరులు పుష్పగుచ్ఛాలతో గవర్నర్‌కి స్వాగతం పలికారు. గవర్నర్ తన పర్యటనలో భాగంగా తిరుపతి శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ విశ్వవిద్యాలయంలోని కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్సెస్ ఆడిటోరియంలో నిర్వహించనున్న 13వ స్నాతకోత్సవం కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు.



# ఉత్తమ యోగ మాస్టర్‌గా సతీష్ గౌడ్

◆ రితిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో నంది అవార్డు బహుకరణ


కామారెడ్డి/మార్చ్ 30/(జన సంఘర్షణ)




సర్వ వ్యాధులకు ఒకే ఒక మంత్రం అది యోగ. యోగ వల్ల ప్రతి ఒక్క మనిషి ఆరోగ్యంగా, ప్రశాంతత వాతావరణంలో జీవిస్తారని దీనిని దృష్టిలో పెట్టుకొని నిజామాబాద్ జిల్లా రుద్రూర్ గ్రామానికి చెందిన యోగ మాస్టర్ సతీష్ గౌడ్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో యోగ ప్రాధాన్యత గురించి వివరిస్తూ వారికి యోగా వైపు దృష్టిని మళ్లిస్తున్నారు. ఎంతోమందికి ఆరోగ్యంగా ఉండడానికి సతీష్ గౌడ్ చేస్తున్న కృషి కి ఫలితం దక్కింది. రితిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో యోగ గురువులకు నంది అవార్డులను అందజేశారు. ఉత్తమ యోగా మాస్టర్గా సతీశ్ గౌడ్ ఎన్నికైనారు. రితీష్ ఫౌండేషన్ నిర్వాహకులు యోగ మాస్టర్ సతీష్ గౌడ్కు మెమొంటో అందజేసి సత్కరించారు. ఉత్తమ యోగా మాస్టర్గా ఆయన ఈ అవార్డును హైదరాబాద్లో అందుకోకున్నారు. అనంతరం మన దినపత్రిక ప్రతినిధితో సతీష్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ కలుషితమైన నీరు, బయట మార్కెట్లో దొరికే ఫాస్ట్ ఫుడ్, ఇతరత్రా ఆహారాలు తీసుకోవడం వల్ల, మనిషి సగటు జీవితం 45 నుంచి 50 వరకు వచ్చిందని. దీనిని దృష్టిలో పెట్టుకొని ఇలాంటి దీర్ఘ కాలిక రోగాలను దూరం చేయాలంటే, ఒక యోగ వల్ల సాధ్యమైతుందని గుర్తించిన సతీష్ గౌడ్, ప్రతి ఒక్కరిని యోగ వైపు మళ్ళీ ఇస్తున్నారు. చిన్న ,పెద్ద ,మహిళా అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరు సతీష్ గౌడ్ నిర్వహించే యోగ కార్యక్రమంలో పాలుపంచుకొని ,వారు అనారోగ్యాలకు దూరంగా ఉంటున్నారు. దీనికి కేవలం యోగ వల్లే సాధ్యమని సతీష్ గౌడ్ వెల్లడించారు.

## వైభవంగా శ్రీ కోదండరాముని తెప్పోత్సవాలు ప్రారంభం

తిరుపతి, మార్చి 30 జన సంఘర్షణ :



తిరుపతి శ్రీకోదండరామస్వామి వారి తెప్పోత్సవాలు సోమవారం శ్రీరామచంద్ర పుష్కరిణిలో వైభవంగా ప్రారంభమయ్యాయి. విద్యుద్దీపాలతో సర్వాంగసుందరంగా అలంకరించిన తెప్పపై స్వామి, అమ్మవారు ఆశీనులై ఐదుచుట్లు తిరిగి భక్తులను కటాక్షించనున్నారు. విశేష సంఖ్యలో భక్తులు హాజరై కర్పూర నీరాజనాలు సమర్పిస్తారు. ఇందులో భాగంగా ఉదయం 8 నుండి 9.30 గంటల వరకు శ్రీ సీతాలక్ష్మణ సమేత శ్రీ కోదండరామస్వామివారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, చందనం, కొబ్బరి నీళ్లతో విశేషంగా అభిషేకం చేశారు. శ్రీ సీతారామలక్ష్మణుల ఉత్సవమూర్తులను రామచంద్ర పుష్కరిణికి వేంచేపు చేశారు. రాత్రి 7 నుండి 8 గంటల వరకు తెప్పోత్సవం నిర్వహించారు. విద్యుద్దీపాలతో సర్వాంగసుందరంగా అలంకరించిన తెప్పపై శ్రీ సీతారామలక్ష్మణులు ఆశీనులై ఐదుచుట్లు తిరిగి భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో నాగరత్న, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## కడూరులో పౌర హక్కుల దినోత్సవం నిర్వహణ

- హక్కులపై అవగాహన సమస్యలపై చర్చ జరిపిన అధికారులు

వరదయ్యపాలెం,జన సంఘర్షణ :
కడూరు ఎస్ సి కాలనీ గ్రామంలో పౌర హక్కుల దినోత్సవం కార్యక్రమం సర్పంచ్ సుజాత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో డీవీఎంసీ మెంబెర్ గుత్తి త్యాగరాజు, ఎంపీడీఓ విజయమ్మ, ఏఓ గౌరీ,రెవిన్యూ మల్లికార్జున్, హాస్టల్ వార్డెన్,తదితరులు పాల్గొని ప్రజలకు తమ హక్కులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు తమ ప్రాంతానికి సంబంధించిన పలు సమస్యలను అధికారుల ముందుకు తీసుకువచ్చారు. అయ్యోరిమిట్టలోని తన స్థలంను తనకు తెలియకుండా మరొకరికి అమ్మేశారని ఓ మహిళ సమావేశం ద్రుష్టికి తీదుకొచ్చింది. ముఖ్యంగా పరిశుభ్రత, పారిశుద్ధ్యం, స్మశానం వరకు సీసీ రోడ్డు నిర్మాణం, ఎస్టీలకు రహదారి సౌకర్యం వంటి అంశాలను ప్రస్తావించారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విన్న ఎంపీడీఓ విజయమ్మ, ఏఓ గౌరీ వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ప్రతి ప్రభుత్వం కల్పించిన 108, 100, 104, 1064, 14400 లాంటి అత్యవసర సేవల టోల్ ఫ్రీ నెంబర్లు గుర్తుపెట్టుకోవాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహనా పెంచుకుని సద్వినియోగం చేసుకోవాలని, కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి డీవీఎంసీ మెంబర్ గుత్తి త్యాగరాజు ధన్యవాదాలు తెలిపారు. అయితే కొన్ని శాఖల అధికారులు గైర్హాజరు కావడం పై గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు. విఆర్ఓ రజనీకుమార్, కడూరు, నెలటూరు పంచాయతీ కార్యదర్శిలు, వెలుగు సీసీ, అంగన్వాడీ కార్యకర్త, ఎంపీటీసి కుమారుడు సుబ్రహ్మణ్యం, ఎం జె కుమార్, ఎం సుబ్రహ్మణ్యం, వి రమణయ్య, చెంచమ్మ, ప్రసన్న, రాణెమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఆర్టీసీ చెంగిచెర్ల డిపోలో డయల్ యువర్ డీఎం



**చెంగిచెర్ల జనసంఘర్షణ :**
ఆర్టీసీ చెంగిచెర్ల డిపో పరిధిలోని ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి గాను నేడు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ చెంగిచెర్ల డిపో మేనేజర్ కే. కవిత తెలిపారు. ఆర్టీసీ చెంగిచెర్ల డిపోలో సోమవారం ఆమే మాట్లాడుతు డిపో పరిధిలోని పలు రూట్లలో ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు ప్రయాణికుల సలహాలు, సూచనలు తెలుసుకునేందుకు గాను డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రయాణికులు మంగళవారం సాయంత్రం 3 గంటల నుండి 4 గంటల మద్య డిపో మేనేజర్ సెల్ 78930 88433 నెంబర్ ను సంప్రదించాలని ఆమె కోరారు.

## శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాణానికి రూ.1 లక్ష విరాళం



**మేడిపల్లి జనసంఘర్షణ**
మండలంలోని మాచాపూర్ గ్రామంలో నిర్మించ తలపెట్టిన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయ నిర్మాణానికి మాచాపూర్ గ్రామ సర్పంచ్ పెటెరి రోజా నాగరాజు రూ. 1,00,000ను ఆదివారం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సంఘ సభ్యులకు చెక్కును అందజేసి మాట్లాడారు. ఆలయ నిర్మాణంలో భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందని, మరింత మంది దాతలు ముందుకొచ్చి విరాళాలు అందజేయాలని కోరారు. మాచాపూర్ గ్రామ అభివృద్ధి తన ధ్యేయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రోజా నాగరాజు కాంగ్రెస్ నాయకులు పెటెరి లక్ష్మణ్, పేటెరి రవి, మంతెన అంజయ్య, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు కుందూరి చిరంజీవి, సంఘ సభ్యులు కుందూరి గంగారాజం, లక్ష్మి, మంతెన గట్టయ్య, కుందూరి చందు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములను కాపాడాలని సిపిఐ డిమాండ్

**-నిజాంపేట్ సర్వే స్థలాల్లో జరుగుతున్న అక్రమాలపై వినతిపత్రం**




**బాచుపల్లి జనసంఘర్షణ**
బాచుపల్లి మండల పరిధిలోని నిజాంపేట్ గ్రామం సర్వే నెంబర్లు 103, 109లో ప్రభుత్వ భూము లను అక్రమంగా ఆక్రమించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, వెంటనే వ్యవస్థ కదలి కట్టడి చేయాలని సిపిఐ రాష్ట్ర నాయకులు కె. యేసు రత్నం డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూముల రక్షణ కోసం పోరాటం చేపట్టిన సిపిఐ నేతలు మేడ్చల్--మల్కాజ్గిరి జిల్లా ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని అదనపు కలెక్టర్ విజేయేంద్ర రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. నిజాంపేట్ సర్వే నంబర్ 103లో ప్రభుత్వ స్థలాన్ని కొందరు వ్యక్తులు తప్పుడు పత్రాలతో ఆక్రమించి అక్రమ నిర్మాణాలు కొనసాగిస్తున్నారని సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్ ఆరోపించారు. అలాగే సర్వే నంబర్ 109లోనూ ప్రభుత్వ స్థలాన్ని అనధికారంగా కబ్జా చేసి, మున్సిపల్ అనుమతులు లేకుండానే అదనపు అంతస్థులు నిర్మిస్తున్నారని ఆయన తెలిపారు. ఈ విధమైన నిర్మాణాలు పూర్తిగా చట్టవిరుద్ధమైనవని, సంబంధిత శాఖలు ప్రదేశాన్ని పరిశీలించి తక్షణమే చర్యలు తీసుకోవాలని నేతలు కోరారు. ప్రభుత్వ భూములు ప్రజల సంపద అని, వాటిని కొందరు భూస్వాహకులు ఆక్రమించే ప్రయత్నాలను సిపిఐ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని కె. యేసు రత్నం హితవు పలికారు. అక్రమ నిర్మాణాలను వెంటనే నిలిపివేయకపోతే భారీ స్థాయిలో ప్రజా ఉద్యమం చేపట్టనున్నట్లు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నరేంద్ర ప్రసాద్, సుజాత, రమదేవి తదితరులు పాల్గొన్నారు.



## జహీరాబాద్లో ఎన్ పి ఆర్ డి క్యాలెండర్ ఆవిష్కరణ

**జహీరాబాద్ జనసంఘర్షణ :**
జహీరాబాద్లో ఎన్ పి ఆర్ డి 2026 క్యాలెండర్ను డీఎస్పీ సైదా నాయక్ ఆవిష్కరించారు. ఈసందర్భంగాఆయన మాట్లాడుతూ...వికలాంగులు అన్ని రంగాల్లో రాణించాలనిఆకాంక్షించారు. వికలాంగులపై అక్రమ దాడులు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఉద్యమకారుల అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం

**- హైదరాబాద్ వెళుతున్న ఉద్యమకారులను అరెస్టు చేసిన పోలీసులు**

**- అక్రమ అరెస్టులను ఖండించిన ఉద్యమకారులు**




**చంద్రుగొండ జనసంఘర్షణ**
ఉద్యమకారులకు అమలు చేస్తానన్న హామీలు అమలు చేయక పోవాడాన్ని నిరసిస్తూ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చేపట్టిన చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో భాగంగా ఆదివారం చంద్రుగొండ నుంచి హైదరాబాదు బయలుదేరిన ఉద్యమకారుల సంఘం జేఏసీ నాయకులను చంద్రుగొండ పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కి తరలించారు. ఈ అరెస్టులను ఉద్యమకారులు తీవ్రంగా ఖండించారు. స్వరాష్ట్రం కోసం అలుపెరుగని పోరాటాలు చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్న రాష్ట్రంలో ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలని కోరితే అప్రజాస్వామికంగా అరెస్టులు చేయడం సిగ్గుచేటు అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఉద్యమకారులను ఆర్థికంగా ఆదుకోవాలని, ప్రభుత్వ పథకాలలో మొదటి ప్రాధాన్యత కల్పించాలని, ప్రతి ఒక్కరికి ప్రమాద బీమా, పెన్షన్లు, ఇంటి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్కె జాఫర్, ఉద్యమకారులు ఎస్.కె ఉమర్, అంచ కృష్ణ, మహమ్మద్ నాబీద్, సులగం శ్రీనివాస్, ఎండి జాకీర్, ఎండి హస్సన్ ఖాసీం, చల్లపల్లి రాజా, బడిగల శ్రావణ్ కుమార్, దుంప అర్జున్, ఎస్.కె అన్వర్, వరికూటి వెంకట్రావు, తేజవత్ బీముడు, శ్రీరాం రమేష్, అరెస్ట్ అయిన వారిలో ఉన్నారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం: పరమేశ్వర్ రెడ్డి





**ఉప్పల్ జనసంఘర్షణ :**
ఉప్పల్ నియోజకవర్గంలో పేదల వైద్యం కోసం ముఖ్యమంత్రి సహాయనిధి నిజమైన వరప్రసాదంగా మారుతోందని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి అన్నారు. చిలకనగర్ డివిజన్ పరిధిలోని న్యూ రామ్నగర్ కాలనీకి చెందిన రాధా రామ్ ఆరాధ్య తీవ్రమైన అనారోగ్య పరిస్థితిని తెలుసుకున్న వెంటనే ప్రభుత్వ సహాయం అందించే దిశగా చర్యలు చేపట్టినట్లు వివరించారు. చిలకనగర్ డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆకిటి ఆగం రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు మొలకలపల్లి రాజేష్ ముదిరాజ్ పరిస్థితిని పరమేశ్వర్ రెడ్డికి తెలియజేయడంతో... వెంటనే స్పందించిన ఆయన ముఖ్యమంత్రి సహాయనిధి పథకం కింద అత్యవసర వైద్యం కోసం రూ. 50,000 సహాయం మంజూరు అయ్యేలా కృషి చేశారు. ఉచిత వైద్యం కోసం ప్రభుత్వం జారీ చేసిన ఎల్.ఓ.సి పత్రాన్ని (వైద్య చికిత్సకు అనుమతి పత్రం) పరమేశ్వర్ రెడ్డి స్వయంగా కుటుంబ సభ్యులకు అందజేశారు. రోగి నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందేందుకు ఈ ఆర్థిక సహాయం పెద్ద మద్దతు అవుతుందని కుటుంబం పేర్కొంది. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ..ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు ప్రభుత్వం అందించే సహాయాన్ని వారికి అందించడం మన బాధ్యత. ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు జీవనాధారంగా నిలుస్తోంది. ఇలాంటి మరెంతో మందికి సహాయం అందేలా కృషి కొనసాగిస్తాం," అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాకారం లక్ష్మణ్, ఆకిటి ఆగం రెడ్డి, రాజేష్ ముదిరాజ్, ఉపేందర్ రెడ్డి, గణేష్ నాయక్, కంది శ్రవణ్ రెడ్డి, బాలయ్య బాబు, కిషన్ నాయక్, విజయ్ కుమార్, గొరిగె మహేష్, రాజన్న, నాయక్, సర్ఫరాజ్, బాకారం అరుణ్, ధర్మేందర్ నాయక్, సుమన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# అడ్డా కార్మికుల కోసం ఐదు రూపాయల భోజన పథకం అమలు చేయాలి

**-ఇందిరమ్మ క్యాంటీన్ ఏర్పాటు చేయాలని సిఐటియు డిమాండ్**



**కీసర జనసంఘర్షణ :**
జవహర్ నగర్-బాలాజీ నగర్ అడ్డాల్లో ఉపాధి కోసం ప్రతిరోజూ వేచి ఉండే హమాలి, భవన నిర్మాణ కార్మికుల ఆకలి సమస్య దృష్ట్యా అక్కడే ఇందిరమ్మ క్యాంటీన్ ఏర్పాటు చేసి ఐదు రూపాయల భోజన పథకాన్ని అమలు చేయాలని సిఐటియు నాయకులు కీసర సర్కిల్ ఉప కమిషనర్ ఎన్. వసంతకు వినతిపత్రం అందజేశారు. ఈ విషయాన్ని మేడ్చల్--మల్కాజ్గిరి జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు చింతకింది అశోక్ వెల్లడించారు. వినతిపత్రం అనంతరం మాట్లాడిన చింతకింది అశోక్ "అడ్డా కార్మికుల పరిస్థితి రోజురోజుకు అధ్వాన్నంగా మారుతోంది. పని కోసం ఉదయం నుంచి సాయంత్రం వరకు అడ్డాల వద్ద దినసరి కూలీ కోసం ఎదురు చూసే కార్మికులు చాలా రోజులు ఉపాధి దొరకక ఆకలితో అలమటిస్తున్నారు. జవహర్ నగర్--బాలాజీ నగర్ అడ్డాల్లో రోజుకు 300 మందికి పైగా కార్మికులు ఉపాధి కోసం పడిగాపులు పడుతున్నారు. వీరికి కనీసం ఐదు రూపాయల భోజనం అందేలా ప్రభుత్వం వెంటనే ఇందిరమ్మ క్యాంటీన్ ఏర్పాటు చేయాలి" అని డిమాండ్ చేశారు. సానుకూలంగా స్పందించిన అధికార యంత్రాంగం వినతిపత్రం స్వీకరించిన ఉప కమిషనర్ ఎన్. వసంత ఈ డిమాండ్పై సానుకూలంగా స్పందించారు. "అడ్డా కార్మికులు ఎదుర్కొంటున్న కష్టాలు చాలా తీవ్రంగా ఉన్నాయని తెలుసుకున్నాం. ఇందిరమ్మ భోజన పథకం అమలు కోసం అవసరమైన చర్యలు త్వరితగతిన తీసుకుంటాం. వీలైనంత త్వరలో ఇందిరమ్మ క్యాంటీన్ అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తాం" అని హామీ ఇచ్చారు.

**సిఐటియు ఆధ్వర్యంలో ప్రతిఘటన**

అడ్డా కార్మికుల ఆకలి సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లేందుకు సిఐటియు నాయకులు ముందుకు వచ్చారు. కార్మిక హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న సిఐటియు ఈసారి కార్మికుల కడుపు నిండేలా ఐదు రూపాయల భోజన పథకం అమలు ప్రధాన లక్ష్యంగా వినతిపత్రం సమర్పించింది. ఈ కార్యక్రమంలో సిఐటియు కీసర మండల కార్యదర్శి బంగారు నర్సింగ్ రావు, నాయకులు నగేష్, శివన్నారాయణ, కుమార్, చంద్రశేఖర్ తదితరులు

# హబ్సిగూడలో టీజీఎస్పీడీసీఎల్ ఆర్టిజన్ కార్మికుల ఆందోళన

**- రెగ్యులర్ ఉద్యోగ హోదా ఇవ్వాలని డిమాండ్**




**ఉప్పల్ జనసంఘర్షణ :**
హబ్సిగూడలోని టీజీఎస్పీడీసీఎల్ డివిజన్ కార్యాలయం ఎదుట ఆర్టిజన్ కార్మికులు భారీ ఆందోళన నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ ఆందోళనలో ఆర్టిజన్ కార్మికులతో పాటు మీటర్ రీడర్లు, బిల్ కలెక్టర్లు, పీస్ రేట్ కార్మికులు, పీఏలు, ఎస్పీఎం, అన్మాండ్, టీఆర్ఈ కార్మికులు పాల్గొన్నారు. వివిధ కార్మిక సంఘాలకు చెందిన ఉద్యోగులు జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ)గా ఏర్పడి తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ తాము ఎన్నో సంవత్సరాలుగా విద్యుత్ శాఖలో సేవలందిస్తున్నప్పటికీ ఇప్పటికీ ద్వితీయ శ్రేణి ఉద్యోగులుగా చూస్తుండడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. కన్వర్షన్ విధానం ద్వారా తమను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించి పూర్తి స్థాయి ప్రభుత్వ ఉద్యోగ హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే వేతన సవరణలు చేపట్టి, ఏపీఎస్ఈబి నిబంధనలు అమలు చేయాలని, తమ అర్హతలకు అనుగుణంగా పోస్టులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటికీ బ్రిటిష్ కాలం నాటి 1947 పాత చట్టాల ఆధారంగా కొనసాగించడం సమంజసం కాదని కార్మికులు మండిపడ్డారు. తక్షణమే తమ సమస్యలను పరిష్కరించకపోతే భవిష్యత్తులో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డివిజన్లలో జేఏసీ ఆధ్వర్యంలో నిరసనలు కొనసాగుతున్నాయని తెలిపారు. అందులో భాగంగా ఏప్రిల్ 2న సర్కిల్ కార్యాలయాల వద్ద వంటా--వార్పు, ఏప్రిల్ 4న పాల్వంచ కేటీపీఎస్ వద్ద నిరసన, ఏప్రిల్ 7న వరంగల్ విద్యుత్ భవన్ వద్ద మహా ధర్నా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఏప్రిల్ 7లోగా ప్రభుత్వం స్పందించకపోతే ఏప్రిల్ 8 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా "కరెంటోళ్ల సమ్మె" పేరిట పెద్ద ఎత్తున సమ్మె చేపట్టనున్నట్లు హెచ్చరించారు.

## రైతుల సమస్యలు పరిష్కరించాలి

- ప్రభుత్వంపై స్పష్టత కోరిన కిసాన్ మోర్చా
- పూర్తి చెల్లింపులు చేయాలని డిమాండ్



**జహీరాబాద్ జనసంఘర్షణ :**
సంగారెడ్డి జిల్లాలో రైతులపథకం అమలుపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ పథకం కింద రైతులకు ఎకరానికి మాత్రమే నిధులు జమవుతున్నాయని, మిగతా ఎకరాలకు సంబంధించిన చెల్లింపులు నిలిచిపోయాయని కిసాన్ మోర్చా జిల్లా వైస్ ప్రెసిడెంట్ శివకుమార్ తెలిపారు.మిగిలిన ఎకరాలకు నిధులు ఎప్పుడు జమ చేస్తారో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే స్పందించి పూర్తి స్థాయిలో చెల్లింపులు చేయాలని కోరారు.రైతుల సమస్యను తక్షణమే పరిష్కరించకపోతే ఉద్యమం చేపట్టే అవకాశం ఉందని హెచ్చరించారు.

## యువత జీవితాలు నాశనం చేసుకోవద్దు

**-ఎస్సై కాశీనాథ్ యాదవ్**




**జహీరాబాద్ జనసంఘర్షణ :**
ఐపీఎల్ 2026 సీజన్ నేపథ్యంలో క్రికెట్ బెట్టింగ్లపై కఠిన చర్యలు తీసుకుంటామని జహీరాబాద్ రూరల్ ఎస్సై కాశీనాథ్ యాదవ్ హెచ్చరించారు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో యువత బెట్టింగ్లకు అలవాటు పడుతూ జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు.బెట్టింగ్ వల్ల అప్పుల పాలై కుటుంబాలు ఇబ్బందులు పడే ప్రమాదం ఉందని తెలిపారు. ఆన్లైన్ యాప్స్ ద్వారా బెట్టింగ్కు పాల్పడేవారిపై నిఘా ఉంచుతున్నామని, అక్రమాలకు పాల్పడితే పిడి యాక్ట్ కింద కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## అరుణాచలం -రామేశ్వరం కు బస్సు సర్వీసు

**గోదావరిఖని,మార్చి 30:-**




**జనసంఘర్షణ**
ఆదివారం ఏప్రిల్ 12 న గోదావరిఖని,పెద్దపల్లి మరియు కరీంనగర్ నుండి అరుణాచలం-రామేశ్వరంకు ప్రత్యేకంగా రాజధాని ఎ /సి బస్సును ఏర్పాటుచేయడమైనది.ఏప్రిల్ 12 ఆది వారం మద్యాహ్నం గం॥01:00 కు గోదావరిఖని నుండి బయలుదేరే ఈ బస్సు కాణిపా కం,అరుణాచలం, శ్రీరంగం,పళని, పాతాలశం భు,మధురై, రామేశ్వరం,కన్యాకుమారి, విష్ణుకం చి,శివకంచి మరియు జోగులాంబ ఈ పది యాత్రలు దర్శనం అనంతరం తిరిగి ఏప్రిల్ 19న గోదావరిఖనికి చేరుకుంటుంది.ఈ సర్వీసులకు 97228 నంబర్ తో రిజర్వేషన్ లో ఉంచబడినది.ఈ ప్రయాణానికి చార్జి పెద్దలకు: రూ॥10,500/-, పిల్లలకు రూ॥8000/- గా నిర్ణయించబడినది.మరిన్ని వివరాలకు 7382847596, 7013504982 నంబర్లను సంప్రదించగలరు.

# సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడం డ్రైవర్ల ప్రధాన బాధ్యత

**- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్**

**- వాహనాలకు రేడియం స్టిక్కర్లు తప్పనిసరి**




**కోరుట్ల :**
రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కల్పించేందుకు తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న “అరైవ్ అలైవ్ కంపెనింగ్ ఫర్ సేఫ్ రోడ్స్” కార్యక్రమంలో భాగంగా సోమవారం కొరుట్ల పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో కొరుట్ల, మెట్పల్లి ప్రాంతాలకు చెందిన లారీ, ఐచర్ మరియు ఇతర భారీ వాహనాల డ్రైవర్లు, యజమానుల కోసం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరై ట్రాఫిక్ నియమాలు, డిఫెన్సివ్ డ్రైవింగ్ ప్రాముఖ్యత, రహదారి భద్రతపై మార్గదర్శకాలు అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ... ప్రస్తుత కాలంలో ఇతర ప్రమాదాల కంటే రోడ్డు ప్రమాదాల వల్లనే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఈ ప్రమాదాలను గణనీయంగా తగ్గించేందుకు గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు రోడ్డు భద్రతా వ్యవస్థలను బలోపేతం చేయడం, ప్రజల్లో డిఫెన్సివ్ డ్రైవింగ్ సంస్కృతిని పెంపొందించడం “అరైవ్ అలైవ్” కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు ఎప్పుడు, ఎలా జరుగుతాయో ముందుగా ఊహించలేమని, కాబట్టి నివారణ చర్యలు అత్యంత కీలకమని స్పష్టం చేశారు. చిన్న నిర్లక్ష్యాలే పెద్ద ప్రమాదాలకు దారితీస్తాయని, అలాంటి సంఘటనల వల్ల కుటుంబాలకు తీరని నష్టం కలుగుతుందని అన్నారు. ప్రతి డ్రైవర్ బాధ్యతాయుతంగా వ్యవహరించి ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. రాత్రి సమయంలో వాహనాలను రోడ్డు పక్కన నిలిపే సందర్భాల్లో రేడియం స్టిక్కర్లు తప్పనిసరిగా అమర్చుకోవాలని, తద్వారా ఇతర వాహనదారులకు వాహనాలు స్పష్టంగా కనిపించి ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. అధిక ప్రకాశం ఉన్న ఎల్ఈడి లైట్లు ఎదురుగా వచ్చే వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తాయని, వాటిని నియంత్రణలో వినియోగించాలని సూచించారు. అలాగే అధిక లోడ్తో లారీలు, ఐచర్ వాహనాలు నడపడం ప్రమాదకరమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ స్వయంగా లారీలు, వ్యాన్ వాహనాలకు రేడియం స్టిక్కర్లను అతికించి డ్రైవర్లకు భద్రతా చర్యలపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, మెట్పల్లి డీఎస్పీ అడ్డూరి రాములు, కొరుట్ల సీఐ సురేష్ బాబు, ఎస్సై చిరంజీవి, మున్సిపల్ చైర్పర్సన్ తిరుమల వసంత గంగాధర్, ఎంవిఐ శ్రీనివాస్ తదితరులు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో మెట్పల్లి డీఎస్పీ అడ్డూరి రాములు, రవాణా శాఖ అధికారి శ్రీనివాస్, మున్సిపల్ చైర్పర్సన్ తిరుమల వసంత గంగాధర్, స్థానిక ప్రజాప్రతినిధులు, కొరుట్ల సీఐ సురేష్ బాబు, మెట్పల్లి సీఐ అనిల్ కుమార్, కొరుట్ల ఎస్సైలు చిరంజీవి, రామచంద్రం, మెట్పల్లి ఎస్సై కిరణ్, మేడిపల్లి ఎస్సై శ్రీధర్ రెడ్డి, కథలాపూర్ ఎస్సై రవికిరణ్, అలాగే లారీ, వ్యాన్ అసోసియేషన్ సభ్యులు, డ్రైవర్లు, యజమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు...

# కళాశాలపై ఆరోపణలు అవాస్తవం:ప్రిన్సిపల్ జయంతిరెడ్డి



**ఉప్పల్ జనసంఘర్షణ :**
ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాలలో ఒక విద్యార్థిని తమపై చేస్తున్న ఆరోపణలు ఆవాస్తవమని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జయంతిరెడ్డి, అడ్వైజర్ కమిటి మెంబర్ జంగ రామకృష్ణారెడ్డి, జోసెప్ పసల, స్టూడెంట్ వెల్ఫేర్ కమిటి నేత సంధ్యా ఆర్య పేర్కొన్నారు. సోమవారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కళాశాలలో పైనల్ ఇయర్ చదువుతున్న ఒక విద్యార్థిని హజరు తక్కువగా ఉండడంతో తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చామని, గతంలో కూడా ఆరోగ్యం బాగలేదని చెప్పడంతో యూనివర్సిటీకి రాయగా అనుమతించారని తెలిపారు. కాగా ఈ ఏడాది కూడా హజరు తక్కువగా ఉందని, దీనిపై కళాశాల టీచర్లు ప్రశ్నిస్తే వారిపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని వారు తెలిపారు. కళాశాలకు తప్పకుండా హజరయితే తిరిగి పరీక్ష రాయించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. తమ ఉపాధ్యాయుల తప్పేమి లేదన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఆలేరులో అలరించిన పౌరాణిక నాటక ప్రదర్శనలు..







**యాదాద్రి భువనగిరి జిల్లా:మార్చి 30/ఆలేరు:**

ఆలేరు పట్టణ కేంద్రంలోని బీసీ కాలనీలోని స్థానిక బీసీ కమ్యూనిటీ హాల్లో సోమవారం పౌరాణిక నాటక ప్రదర్శన కార్యక్రమం జరిగింది.శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి మూడురోజుల కాల జ్ఞాన ప్రవచనం, పూజా కార్యక్రమాలలో భాగంగా నంది అవార్డు గ్రహీత,సినీ దర్శకుడు టి.రాము ఆధ్వర్యంలో ఈ నాటక ప్రదర్శన కార్యక్రమం నిర్వహిం చారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతకింది మల్లేశం,ప్రముఖ కవి,సీనియర్ జర్నలిస్ట్ తిరునగరి శ్రీనివాస్,ప్రముఖ విద్య వేత్త శ్రీ రాంరెడ్డి హాజరయ్యారు.ఈ నాటక ప్రదర్శనలో ఉభయ తెలుగు రాష్ట్రాలలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రంగస్థల నాటక కళాకారులు తమ అద్భుతమైన నటనను ప్రదర్శించి స్థానిక కళాభిమానులను ఆకట్టుకున్నారు.సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు తెలుగు సాంప్రదాయ నాటకాలైన బాలనాగమ్మ,చింతామణి,సత్య హరిశ్చంద్ర నాటకాలలోని ముఖ్య ఘట్టాలను కళాకారులు ప్రదర్శిం చారు.పాత్రలకు జీవం పోసిన నటన, భావప్రకటనలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి.కార్యక్రమానికి హాజరైన స్థానికులు,కళాభిమానులు కళాకారులను అభినం దిస్తూ ఇటువంటి కార్యక్రమాలు మరింతగా నిర్వహించాలని కోరారు.అనంతరం నాటకాలను ప్రదర్శించిన కళాకారులను ముఖ్య అతిథులు శాలువాలతో సత్కరించి షీల్డులను బహుకరించారు.ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు ఎర్ర జాన్సన్,ముల్లెకల రవి కుమార్,సీసా సాయిరాం,కళాకారులు రోజా రాణి, బీవీ సుబ్బా రెడ్డి, సుం దరమ్మ,ప్రకాష్, కళాకారులు, కాలనీవాసులు,తదితరులు పాల్గొన్నారు.







Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi. RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co